





Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్








సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 60 | శనివారం 26 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



### ప్రధాని మోడీ విదేశీ పర్యటనల

## ఖర్చు రూ.350 కోట్లు

**- ఎంఇఎ వెల్లడి**

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, జూలై 25

ప్రధాని మోడీ విదేశీ పర్యటనల కోసం రూ.350 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్రం ప్రకటించింది. 2021 నుండి 2025 మధ్య ప్రధాని పర్యటనల కోసం దేశ ఖజానా నుండి సుమారు రూ. 300 కోట్లు వరకు ఖర్చు చేసినట్లు విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో అమెరికా, ఫ్రాన్స్,



మారిషస్, థాయిలాండ్, శ్రీలంక, సౌదీ అరేబియా పర్యటనకు ఖర్చు చేసిన రూ.67 కోట్లు కూడా ఇందులో ఉన్నాయి. టిఎంసి రాజ్యసభ ఎంపి డెరెక్ ఒబ్రెయిన్

- మిగతా 2లో..

### 'ఎస్ఐఆర్'..

## ప్రజాస్వామ్యంపై దాడే

**- కొనసాగిన ప్రతిపక్షాల ఆందోళన**
**- ఐదోరోజూ స్తంభించిన పార్లమెంటు, 2 8కి వాయిదా**
**- రాజ్యసభ సభ్యులుగా కమల్ హాసన్ ప్రమాణ స్వీకారం**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 25

బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌పై




చర్చకు అంగీకరించకపోవడంతో పార్లమెంటు ఉభయ సభలు ఐదోరోజూ స్తంభించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియను

- మిగతా 2లో..

### దక్షిణాసియాలో

## మరో యుద్ధం..



**- థాయ్‌లాండ్, కంబోడియా మధ్య భీకర ఘర్షణ -ఇరు దేశాల మధ్య ముదురుతున్న ఘర్షణలు - పెరుగుతున్న నిరాశ్రయులు - 800 కిలోమీటర్ల సరిహద్దుపై ఏళ్లుగా వివాదం**

2లో

### ప్రైవేటు సంస్థల్లో

## రిజర్వేషన్లు తీసుకురావాలి

**- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 25

ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు తీసుకురావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. భారతదేశపు ఉత్పాదక శక్తికి ఒబిసిలు ప్రతీకలని అన్నారు. శుక్రవారం నాడిక్కడ జరిగిన 'బాగిదారి న్యాయ మహా సమ్మేళనం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఒబిసిల చరిత్రను ఉద్దేశపూర్వకంగా చెరిపేశాయని అన్నారు. దేశంలో దళితుల చరిత్రను అంబేద్కర్ అర్థం చేసుకున్నారని చెప్పారు. ఒబిసిల చరిత్ర రాయకపోవడం వెనుక ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర ఉందని విమర్శించారు. ఒబిసిలు వారి శ్రమకు తగిన ఫలితాలను అందుకోలేకపోతు



న్నారని పేర్కొన్నారు. 'కార్పొరేట్ ఇండియాలో ఒబిసిలు ఎక్కడున్నారు? మీడియా రంగంలో వారికి స్థానం ఎక్కడుంది?' అని ఆయన ప్రశ్నించారు. కేంద్రంలో కాంగ్రెస్

- మిగతా 2లో..

### మాల్దీవులుకు

## రూ.4,850 కోట్ల రుణం

**- ప్రకటించిన భారత్ - స్వేచ్ఛా వాణిజ్యంపై ఇరు దేశాల చర్చలు**

మాలే - సూర్య వాస్తవం, జూలై 25

మాల్దీవులుకు రూ.4,850 కోట్ల రుణం (లైన్ ఆఫ్ క్రెడిట్)ను భారత్ ప్రకటించింది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాలు చర్చలు ప్రారంభించాయి. రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం ఉదయం ఇక్కడకు చేరుకున్న ప్రధాని నరేంద్ర మోడీకి వెలెనా ఎయిర్‌పోర్టులో మాల్దీవులు అధ్యక్షులు మహ్మద్ ముయిజ్జు, మంత్రులు స్వాగతం పలికారు. సైనికుల నుంచి మోడీ గౌరవ వందనం స్వీకరించారు. విమానాశ్రయంలో తనను కలిసి ప్రవాస భారతీయులతో మోడీ మాట్లాడారు. అనంతరం అధ్యక్షుడు ముయిజ్జుతో ద్వైపాక్షిక చర్చల్లో మోడీ పాల్గన్నారు. మంత్రుల స్థాయిలోనూ చర్చలు



జరిగాయి. అనంతరం మోడీ మీడియాతో మాట్లాడుతూ ఇరుదేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు ప్రారంభమైనట్లు తెలిపారు. ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం ఖరారుకు ఇరు దేశాలు కృషి చేస్తున్నాయని చెప్పారు.

- మిగతా 2లో..



## రాజస్థాన్‌లో ఘోరం

**- పాఠశాల భవనం కుప్పకూలి ఏడుగురు విద్యార్థుల మృతి**
**- విద్యార్థుల మృతితో విషాదంలో తల్లిదండ్రులు**
**- బలిపశువులైన ఉపాధ్యాయులు**
**- ఐదుగురిని సస్పెండ్ చేసిన ప్రభుత్వం**

2లో

## 250 కుటుంబాలకు అండ

**- స్వయంగా దత్తత తీసుకున్న సిఎం చంద్రబాబు**
**- పేదరిక నిర్మూలన కోసం 'పీ4' ప్రారంభం**
**- ఈ పోరాటంలో తన కుటుంబ సభ్యులు కూడా భాగస్వాములని వెల్లడి**
**- 'పీ4' లోగోను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి**
**- దత్తత తీసుకున్న కుటుంబాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపకల్పన**




అమరావతి- సూర్య వాస్తవం, జూలై 25

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో 250 కుటుంబాలను వ్యక్తిగతంగా దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'పీ4' (ప్రజా-ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం) కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం సచివాలయంలో 'పీ4' కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగా ముఖ్యమంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన 'పీ4' లోగోను ఆవిష్కరించారు. అనంతరం అధికారులు

- మిగతా 2లో..

## నేడు సింగపూర్‌కు సిఎం చంద్రబాబు

**- పట్టణాభివృద్ధి, పెట్టుబడులపై చర్చలు**

అమరావతి - సూర్య వాస్తవం, జూలై 25



పట్టణాభివృద్ధి ప్రణాళిక, సుందరీకరణ, పెట్టుబడులపై చర్చించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటి, ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కూడిన బృందం ఈ నెల 26న సింగపూర్ వెళ్లనుంది. ఈ బృందంలో మంత్రులు నారాయణ పలువురు అధికారులు కూడా ఉండనున్నారు. ఈ నెల 31 వరకు ఆరు రోజుల పాటు పర్యటించనున్నారు. అక్కడి ప్రభుత్వ ప్రతినిధులు, పెట్టుబడిదారులతో వివిధ అంశాలపై చర్చలు జరపనున్నారు. వీరి పర్యటన నేపథ్యంలో ప్రవాసాంధ్రులు నిర్వహించే కార్యాక్రమాల్లోనూ వీరు పాల్గొంటారు.





### 2026 తరువాతే...

## పునర్విభజన ప్రక్రియ

**- నియోజకవర్గాల పునర్విభజనపై సుప్రీం**
**- ఆ తరువాత జరిగే మొదటి జనగణన ప్రకారం చేయాలని వ్యాఖ్య**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 25

తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) ప్రక్రియను సత్వరమే ప్రారంభించేలా ఆదేశాలి వ్వాలంటూ

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### వాయువ్య బంగాళాఖాతంలో

## వాయుగుండం

**- వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
**- అత్యవసర సహాయక చర్యల కోసం టోల్ ఫ్రీ నెంబర్లు**
**- 112, 1070,18004250101**
**- హోమ్ మంత్రి అనిత**

అమరావతి - సూర్య వాస్తవం, జూలై 25

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో ఆదివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ, హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ పరిసర ప్రాంతాల్లో వాయుగుండం గంటకు 18 కిలో మీటర్ల వేగంతో పశ్చిమ, వాయువ్యదిశగా కదులుతోందన్నారు. తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలంలోని స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్ (ఎస్ఇఓసి)లో ఎమ్‌డి ప్రఖర్‌జైన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్, ప్రాజెక్టు మేనేజర్లతో కలిసి హోమ్ మంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా

- మిగతా 2లో..

# దక్షిణాసియాలో మరో యుద్ధం..

**- థాయ్‌లాండ్, కంబోడియా మధ్య భీకర ఘర్షణ**

**-ఇరు దేశాల మధ్య ముదురుతున్న ఘర్షణలు**

**- పెరుగుతున్న నిరాశ్రయులు**

**- 800 కిలోమీటర్ల సరిహద్దుపై ఏళ్లుగా వివాదం**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 25**

థాయ్‌లాండ్, కంబోడియా సైనికుల మధ్య సరిహద్దు వెంబడి శుక్రవారం తెల్లవారుజామున రెండో రోజు కూడా ఘర్షణలు తీవ్రమ య్యాయి. కంబోడియా సైన్యం ఆర్టిలరీ, రాకెట్లతో భారీ ఆయుధాలను ఉపయోగించినట్టు థాయ్‌లాండ్ సైన్యం పేర్కొంది. ఈ సరిహద్దు వివాదం కారణంగా ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రజలు నిరాశ్రయులయ్యారు. మరణాల సంఖ్య పెరుగుతోంది. థాయ్‌లాండ్ సైన్యం కథనం ప్రకారం.. కంబోడియా దళాలు ఫీల్డ్ ఆర్టిలరీ, బీఎం-21 రాకెట్ సిస్టంలను ఉపయోగించి బాంబు దాడులకు దిగాయి. థాయ్ దళాలు యుద్ధ వ్యూహానికి అనుగుణంగా స్పందించాయి. గత దశాబ్దంలో జరిగిన అత్యంత తీవ్రమైన సరిహద్దు ఘర్షణల కారణంగా నాలుగు సరిహద్దు ప్రావిన్స్‌ల నుంచి 100,000 మందికి పైగా ప్రజలను దాదాపు 300 తాత్కాలిక ఆశ్రయ కేంద్రాలకు తరలించారు. థాయ్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకారం ఈ ఘర్షణలలో మరణాల సంఖ్య 14కు చేరింది. వీరిలో 13 మంది పౌరులు, ఒక సైనికుడు ఉన్నారు. ఈ సంక్షోభంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి నేడు అత్యవసర సమావేశాన్ని నిర్వహించనుంది. తక్షణమే కాల్పుల విరమణకు ప్రపంచ దేశాలు పిలుపునిచ్చాయి. థాయ్ భూభాగంపై కంబోడియా రాకెట్లు, ఆర్టిలరీని ప్రయోగించగా.. థాయ్‌లాండ్ ఎఫ్-16 ఫైటర్ జెట్లను ఉపయోగించి సరిహద్దు ఆవల సైనిక లక్ష్యాలపై దాడులకు దిగింది. ఐదుగురు థాయ్ సైనికులు ల్యాండ్‌మైన్ పేలుడులో గాయపడటంతో కంబోడియా రాయబారిని థాయ్‌లాండ్ బహిష్కరించింది.

**దీర్ఘకాలిక వివాదం**

800 కిలోమీటర్ల (500 మైళ్ల) సరిహద్దుపై ఇరు దేశాల మధ్య దీర్ఘకాలికంగా వివాదం ఉంది. 2008 నుంచి 2011 వరకు జరిగిన ఘర్షణలలో కనీసం 28 మంది మరణించారు. వేలాది మంది నిర్వాసితులయ్యారు. 2013లో ఐక్యరాజ్యసమితి కోర్టు తీర్మానం ఈ సరిహద్దు వివాదాన్ని ఒక దశాబ్దం పాటు నియంత్రణలో ఉంచింది. అయితే, మే నెలలో ఒక కంబోడియా సైనికుడు తాజా ఘర్షణలో మరణించడంతో ఉద్రిక్తతలు మళ్లీ పెరిగాయి. ఈ రెండు దేశాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

# ప్రైవేటు సంస్థల్లో రిజర్వేషన్లు తీసుకురావాలి

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేయలేకపోయామని, అది ముమ్మాటికీ తన తప్పిదమేనని అన్నారు. 'మీ (ఒబిసి) చరిత్ర, సమస్యలను కొంచెం ముందుగానే తెలుసుకుని ఉన్నట్లయితే అప్పట్లోనే కులగణన చేపట్టి ఉండేవాడిని. అది కాంగ్రెస్ పార్టీ తప్పు కాదు, ముమ్మాటికీ నా తప్పే. ఇప్పుడు ఆ తప్పును సరిచేసుకునే ప్రయత్నం చేస్తున్నాం' అని రాహుల్ అన్నారు. కులగణన కూడా ఎప్పుడో చేయాల్సిందని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తప్పకుండా కులగణన పూర్తి చేస్తామని తెలిపారు. తెలంగాణ కులగణన దేశానికే రోల్‌మోడల్ అని రాహుల్ గాంధీ అన్నారు. అభివృద్ధిలో విద్యే ప్రధానమని, ఇంగ్లీష్ నేర్చుకుంటే అవకాశాలు రెట్టింపవుతాయని చెప్పారు. బిజెపి నేతలు మాత్రం ఇంగ్లీష్‌ను వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ప్రాంతీయ భాషలూ ముఖ్యమేనని, దాంతోపాటు ఆంగ్ల ప్రాధా న్యాన్నీ అర్థం చేసుకోవాలని అన్నారు. ఇంగ్లీషును వ్యతిరేకిస్తున్న వారు తమ పిల్లలను ఎక్కడ చదివిస్తున్నారని ప్రశ్నించారు.

# 250 కుటుంబాలకు అండ

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రికి (నేను మార్గదర్శిని) బ్యాడ్జ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "దత్తత తీసుకున్న ఈ 250 కుటుంబాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత పూర్తిగా నాదే. వారి అభ్యున్నతి కోసం ఒక పక్కా ప్రణాళికను రూపొందిస్తున్నాం," అని స్పష్టం చేశారు. పేదరికంపై ప్రభుత్వం సాగిస్తున్న ఈ పోరాటంలో తనతో పాటు తన కుటుంబ సభ్యులు కూడా భాగస్వాములు అవుతారని ఆయన తెలిపారు. గతంలో జన్మభూమి స్ఫూర్తితో గ్రామాలను అభివృద్ధి చేశామని, ఇప్పుడు అదే స్ఫూర్తితో 'పీ4' కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలను ఆదుకోవడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. పేదలకు అండగా నిలిచే ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని, దేశానికే ఆదర్శంగా నిలిచేలా దీన్ని తీర్చిదిద్దుతామని చంద్రబాబు వివరించారు.

# వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండం

(మొదటిపేజీ తరువాయి)

ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సంభవించే వాయుగుండాలు, భారీ వర్షాలు, చెదురుమదురుగా కురిసే వర్షాలు, తుఫానులు, వరదలు వంటి వాటి పట్ల స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను రూపొందించి అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినా ఎదుర్కోవడంతో పాటు అత్యవసర సహాయకచర్యల కోసం కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలన్నారు. వాయుగుండం ప్రభావంతో ఆదివారం వరకు కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు, పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తీరం వెంబడి గంటకు 40-60 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. హోర్డింగ్స్, శిధిలావస్థలోని భవనాల గోడలు, వృక్షాల వద్ద నిలబడరాదన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం తీరాల్లో 2.9 నుంచి 3.6 మీటర్ల ఎత్తులో అలలు ఎగిసిపడే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ళరాదన్నారు, తారప్రాంత కార్యకలాపాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**ప్రమాదం జరిగే హాట్ స్పాట్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు :**

వర్షాలు, తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి అనిత , అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని గుర్తించిన హాట్ స్పాట్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లాల కలెక్టర్లకు ఆమె సూచించారు. ఇరిగేషన్, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్‌శాఖలతో సమన్వయ పరుచుకుని గండ్లు పడిన ప్రాంతాల్లో వెంటనే మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. విపత్తుల పట్ల సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారిక హెచ్చరికలను ప్రతి ఒక్కరూ గమనించాలని హోమ్ మంత్రి అనిత తెలిపారు.

## ప్రధాని మోడీ విదేశీ పర్యటనల

# ఖర్చు రూ.350 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నలకు విదేశాంగ మంత్రిత్వ శాఖ లిఖిత పూర్వక సమాధానమిచ్చింది. ఫిబ్రవరి 10 నుండి 13 మధ్య మోడీ ఫ్రాన్స్, అమెరికాలను సందర్శించారని, ఫ్రాన్స్ పర్యటనకు అత్యధికంగా 25 కోట్లు (రూ.25, 59,82,902), అమెరికా పర్యటనకు రూ.16 కోట్లు (రూ.16,54,84,302) ఖర్చు అయ్యాయని డేటా వెల్లడించింది.

ఏప్రిల్ 3-6ల మధ్య థాయిలాండ్, శ్రీలంక పర్యటనలకు రూ.9 కోట్లకు పైగా ఖర్చయింది. థాయిలాండ్‌కు రూ.4 కోట్ల 92 లక్షలు, శ్రీలంకకు రూ.4 కోట్ల 46 లక్షలు). ఏప్రిల్ 22-23 మధ్య సౌదీ అరేబియాకు వెళ్లారు. ఈ పర్యటనకు రూ.15 కోట్ల 54 లక్షల 03వేల 792.47 ఖర్చయింది. మార్చి 11-12 మధ్య ప్రధాని మారిషస్‌కు, జులై 15-19 తేదీల మధ్య సైప్రస్, కెనడా , క్రొయేషియా మరియు ఘనాల్లో పర్యటించారు. జులై 2-9ల మధ్య ట్రినిడాడ్, టబాగో, అర్జెంటీనా, బ్రెజిల్ మరియు నమీబియాలను సందర్శించారు. కానీ ఈ బిల్లులు పూర్తికానందున ఖర్చుల వివరాలను వెల్లడించలేదు. 2024 లో, ఫిబ్రవరి 13-15 మధ్య ప్రధాని యుఎఇ, ఖతార్‌లను సందర్శించారు. ఆ సమయంలో దేశ ఖజానా 3 కోట్ల14 లక్షల30వేల 607 రూపాయలు ఖర్చు చేయగా, మార్చి 22-23 మధ్య భూటాన్ పర్యటనకు 4కోట్ల 50లక్షల27వేల 271రూపాయలు ఖర్చు చేసింది. జూన్ 13-14 మధ్య ఇటలీ పర్యటన కోసం రూ. 14కోట్ల 36లక్షల 55వేల 289 ఖర్చు చేసింది. జులై8-10 మధ్య ఆస్ట్రియా మరియు రష్యా పర్యటనల కోసం వరుసగా రూ. 4 కోట్లకు పైగా, రూ. 5 కోట్లకు పైగా ఖర్చు చేసింది. 2024 ఆగస్టు 21-23 మధ్య జరిగిన రెండు పర్యటనల కోసం ఈ క్రింది ఖర్చు చేసినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. పోలాండ్ కు రూ.10 కోట్లకు పైగా, ఉక్రెయిన్‌కు రూ.2కోట్లకు పైగా ఖర్చు చేసింది.సెప్టెంబర్ 3-5 మధ్య బ్రూనై పర్యటనకు కేంద్రం రూ కోట్లకు పైగా ఖర్చు చేయగా సింగపూర్ పర్యటన కోసం రూ.7కోట్లకు పైగా ఖర్చు చేసింది.

సెప్టెంబర్ 21-23 మధ్య అమెరికా పర్యటన కోసం కేంద్రం రూ.15కోట్ల 33లక్షల 76వేల 348 ఖర్చు చేసింది. అక్టోబర్ 10-11 మధ్య తేదీలలో లావో డిపిఆర్ పర్యటనకు రూ.3 కోట్లు ఖర్చు చేసింది. అక్టోబర్ 22-23 తేదీలలో జరిగిన రష్యా పర్యటనకు రూ.10 కోట్లకు పైగా ఖర్చు చేసింది.

2024లో నవంబర్ 16-21 మధ్య నైజీరియా (రూ.4,46,09,640), బ్రెజిల్ (రూ.5,51,86,592) మరియు గయానాల్లో (రూ.5,45,91,495) ఖర్చ య్యాయి. డిసెంబర్ 22న కువైట్ పర్యటన కోసం రూ.2 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపింది. 2023లో మే 19 నుండి డిసెంబర్ 1 వరకు ప్రధాని మోడీ 11 దేశాలకు ఆరు సార్లు పర్యటించారు. ఖర్చులు జపాన్ (రూ.17,19,33,365), ఆస్ట్రేలియా (రూ.6,06,92,057), అమెరికా (రూ.22,89, 68,509), ఫ్రాన్స్ (రూ.13,74, 81,530, దక్షిణాఫ్రికా (రూ.6,11,37,355), యుఎఇకి రూ.4

# 'ఎస్‌ఐఆర్'..ప్రజాస్వామ్యంపై దాడే

(మొదటిపేజీ తరువాయి)

ఉపసంహరించుకోవాలనిడిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. 53 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోతున్నారని, ఇది రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై మోడీ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఉద్దేశపూర్వకంగా జరుపుతున్న దాడి అని విమర్శించారు. ఉభయసభలు ఈ నెల 28కి వాయిదా పడ్డాయి. రాజ్యసభ సభ్యులుగా ప్రముఖ సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం అధినేత కమల్ హాసన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఉభయ సభలు శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశమ య్యాయి. సభ ప్రారంభం కాగానే లోక్‌సభలో ప్రతిపక్ష ఇండియా బ్లాక్ ఎంపిలు వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టుబట్టారు. ముఖ్యంగా బీహార్‌లో ఓటర్ల జాబితా సవర ణపై చర్చించాలని డిమాండ్ చేశారు. సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఎలాంటి చర్చా లేకుండానే మధ్యాహ్నం 2 గంటల వరకూ సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదు. దీంతో సభను ఈ నెల 28కి వాయిదా వేస్తున్నట్లు స్పీకరు ప్రక టించారు. రాజ్యసభలోనూ అదే పరిస్థితి కొనసాగింది. సభ ప్రారంభంకాగానే సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకులు కమల్ హాసన్ రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తరువాత నిరసనలతో సభ వాయిదా పడింది.

**28న పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చ**

పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ ఘటనలపై పార్లమెంటు ఉభయ సభల్లో చర్చించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ రెండు అంశాలపై చర్చించాలంటూ ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్నా%% ఇన్ని రోజులు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చర్చకు అంగీకరించకుండా మొండిగా వ్యవ హరించిన సంగతి తెలిసిందే. వరుసగా పార్లమెంటు ఉభయ సభలు వాయిదా పడుతూ వచ్చాయి. ఈ నెల 28న రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో చర్చను ప్రారంభిస్తారు. చర్చలో హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జైశంకర్‌తో పాటు బిజెపి ఎంపిలు అనురాగ్ ఠాకూర్, నిషికాంత్ దూబే పాల్గొంటారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చర్చలో పాల్గొనే అవకాశం ఉంది. రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా చర్చలో ప్రభుత్వాన్ని నిలదీయనున్నారు. ఈ నెల 29న రాజ్యసభలో ఈ అంశంపై చర్చ ప్రారంభం కానుంది. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జైశంకర్‌తో పాటు ఇతర మంత్రులు పాల్గొంటారు. రాజ్యసభలో చర్చలోనూ ప్రధాని పాల్గొనే అవకాశం ఉంది.

**బిఎసి సమావేశం**

సభలో నిరసనలకు బ్రేక్ వేసేందుకు లోక్‌సభ స్పీకరు ఓంబిర్లా శుక్రవారం బిఎసి సమావేశం నిర్వహించారు. ప్రతిపక్ష ఎంపిల ప్రశ్నోత్తరాల సమయంలో అర్థవంతమైన చర్చలు జరిపేందుకు సహకరించాలని ప్రతిపక్ష నాయకులను స్పీకరు కోరినట్లు తెలిసింది. దీంతో సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని ప్రతిపక్ష ఎంపిలు చెప్పినట్లు సమాచారం. సోమవారం నుంచి లోక్‌సభ కార్యకలాపాలూ సజావుగా సాగనున్నాయని సమాచారం. అఖిలపక్ష సమావేశం అనంతరం కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యే ముందు కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు ఆపరేషన్ సిందూర్, పహల్గామ్ ఉగ్రదాడిపై పార్లమెంట్లో చర్చించాలని డిమాండ్ చేశాయన్నారు. ప్రతిపక్షం తొలిరోజు నుంచి పార్లమెంట్లో గందరగోళం సృష్టిస్తుందని, పార్లమెంటు కార్యకలాపాలకు అంతరాయం కలిగించొద్దని కోరుతున్నానని అన్నారు. ఆపరేషన్ సిందూర్, పహల్గామ్ ఉగ్రదాడిపై ఉభయసభల్లో 16 గంటల చొప్పున మొత్తం 32 గంటలపాటు చర్చ ఉంటుందన్నారు.

**ఇండియా బ్లాక్ నిరసన ప్రదర్శన**

'ప్రజాస్వామ్యంపై దాడి' అనే బ్యానర్‌తో పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం నుంచి పార్లమెంట్ భవనం ప్రవేశ ద్వారం వరకూ ఇండియా బ్లాక్ ఎంపిలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎస్‌ఐఆర్ అని రాసిన పోస్టర్లను రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే చించివేసి డస్ట్‌బిన్‌లో వేసి, నిరసన తెలిపారు. ఇసి వంటి రాజ్యాంగ సంస్థ 'ఓట్ బందీ' కుట్రలో బిజెపి %-% ఆర్‌ఎస్‌ఎస్‌కు మద్దతు ఇవ్వడం దురదృష్టకరమని ఎక్స్‌లో మల్లికార్జున ఖర్గే పోస్ట్ చేశారు.

## 2026 తరువాతే...

# పునర్విభజన ప్రక్రియ

(మొదటిపేజీ తరువాయి)

దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు 2022లో ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేస్తూ శుక్రవారం తుది తీర్పును వెలువరించింది. ఈ రిట్ పిటిషన్‌పై విచారణ పూర్తి చేసిన ధర్మాసనం ఏప్రిల్ 30న తీర్పును రిజర్వు చేసింది. ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం డిలిమిటేషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణను మినహాయించి కొత్తగా రూపొందించిన జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంలోనే అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన చేయడం అసమంజసమని పిటిషనర్లు తెలిపారు. దీనిపై విచారించిన ధర్మాసనం తాజాగా వెలువరించిన తీర్పులో రాజ్యాంగంలోని ఆర్టికల్ 170(3) ప్రకారం రాష్ట్రాల అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనపై పరిమితులు ఉండే అవకాశముందని పేర్కొంది. ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26కి కూడా పరిమితి ఉందని పేర్కొంది. ఆర్టికల్ 170కి లోబడే ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 26 ఉందని, దీని ప్రకారం 2026 తరువాత మొదటి జన గణన నిర్వహించిన తరువాత మాత్రమే డిలిమిటేషన్ నిర్వహించవచ్చని పేర్కొంది. జమ్మూకాశ్మీర్‌లోని నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ రాజ్యాంగ పరిధిలోనే జరిగిందని ధర్మాసనం స్పష్టం చేసింది. కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకాశ్మీర్‌లో జరిగిన పునర్విభజనతో తెలుగు రాష్ట్రాలతో పోల్చడం తగదని ధర్మాసనం పేర్కొంది. పునర్విభజన నోటిఫికేషన్ నుండి తెలుగురాష్ట్రాలను మినహాయించడంలో కేంద్రానికి ప్రత్యేక ఉద్దేశ్యం లేదని, ఇందులో రాజ్యాంగ ఉల్లంఘన లేదని సుప్రీంకోర్టు పేర్కొంది.

## మాల్దీవులుకు

# రూ.4,850 కోట్ల రుణం

(మొదటిపేజీ తరువాయి)

రక్షణ, భద్రతా రంగంలో పరస్పర సహకారం పరస్పర విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. మాల్దీవులు తన రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని తెలిపారు. మాల్దీవులు అధ్యక్షుడు ముయిజ్జు మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చలు ప్రారంభమయ్యాయని అన్నారు. మాల్దీవులు ఆర్థిక వ్యవస్థకు ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించడంలో భారత్ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు. కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ ఇరు దేశాలు డిజిటల్ పరివర్తన, ఇతర రంగాలకు సంబంధించిన అవగాహన ఒప్పందాలపై సంతకం చేశాయని తెలిపారు.

# రాజస్థాన్‌లో ఘోరం

**- పాఠశాల భవనం కుప్పకూలి ఏడుగురు విద్యార్థుల మృతి**

**- విద్యార్థుల మృతితో విషాదంలో తల్లిదండ్రులు - బలిపశువులైన ఉపాధ్యాయులు - ఐదుగురిని సస్పెండ్ చేసిన ప్రభుత్వం**

**జైపూర్ - సూర్య వాస్తవం, జూలై 25**

బిజెపి పాలిత రాజస్థాన్‌లో శుక్రవారం పెనువిషాదం చోటు చేసుకుంది. ఝులావర్ జిల్లా పిప్లోడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 6, 7 తరగతులు ఉన్న భవనంలోని కొంతభాగం కుప్పకూలడంతో ఏడుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మరో 35 మంది తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనా స్థలంలోనే ఐదుగురు మరణించారు. ఉదయం 7:45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. భారీ శబ్ధంతో భవనం కూలిపోవడం విన్న స్థానికులు అక్కడకు చేరుకుని శిథిల్లాలో చిక్కుకుని ఉన్న చిన్నారులను వెలికితీశారు. అత్యవసర సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రమాద సమయంలో పాఠశాలలో 50 మంది విద్యార్థులు ఉన్నట్లు స్థానికులు చెప్పారు. గాయపడిన చిన్నారులందరినీ స్థానిక ఆసుపత్రికి తరలించారు. వీరిలో 11 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో ఝులావర్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు.

రాజస్థాన్‌లోని బిజెపి సర్కారు నిర్లక్ష్యమే తమ పిల్లల ప్రాణాలను బలిగొందని పలువురు తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. రాజస్థాన్‌లోని ఝులావర్ జిల్లా పిప్లోడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 6, 7 తరగతులు ఉన్న భవనం కుప్పకూలడంతో ఏడుగురు విద్యార్థులు చనిపోగా, 35 మంది తీవ్రంగా గాయపడ్డారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగానే పాఠశాలను భవనం కూలిపోయిందని అధికారులు చెబుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం కూలిపోయే స్థితిలో ఉందని ఏడాది కాలంగా తహసీల్దార్, సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్‌లకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలనా నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికుడు బాల్‌కిషన్ మీడియాకు తెలిపారు. పాఠశాల భవనం నిర్వహణ సక్రమంగా లేదని, భవనం గోడలపై మొక్కలు మొలిచాయని, గోడల నుంచి నిరంతరం నీరుకారేదని విద్యార్థులు చెప్పారు.

**ఐదుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్**

రాజస్థాన్‌లోని బిజెపి ప్రభుత్వం ఈ ప్రమాదానికి ఉపాధ్యాయులనే బలిపశువులను చేయాలన్ని చూస్తోంది. ఐదుగురు ఉపాధ్యాయుల్ని సస్పెండ్ చేసినట్లు రాష్ట్ర విద్యామంత్రి మదన్ దిలావర్ ప్రకటించారు. ఈ సంఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజేకు పట్టున్న ఈ జిల్లాలో ఇటీవల ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో బికనీర్‌లో నీటిట్యాంక్ కూలిపోవడంతో ముగ్గురు చిన్నారులు మరణించారు. తరువాత బార్మర్‌లోని చోహ్టన్ బ్లాక్‌లో పాఠశాల గోడకూలి ఒక విద్యార్థి మరణించాడు.

# సంపాదకీయం

## ఏడాదిలో 23 వేలకోట్లు




ప్రస్తుత కాలంలో డిజిటల్ ప్రపంచం రోజురోజుకు విస్తరిస్తోంది. ప్రజలు అనేక పనుల కోసం నెట్ ఉపయోగిస్తున్నారు, అదే సమయంలో సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో పలు యాప్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని కేంద్ర సూచించింది.రోజురోజుకూ ఓ వైపు డిజిటల్ వినియోగం పుంజుకుంటున్న నేపథ్యంలో మరోవైపు సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయి. సైబర్ కేటుగాళ్లు సామాన్య ప్రజలను మోసం చేయడానికి కొత్త కొత్త మార్గాలను ఉపయోగిస్తున్నారు. కొంత మందికి వాటి గురించి అవగాహన లేకపోవడం వల్ల ఈ నేరాలకు బలవుతున్నారు. కొందరు తెలియకుండానే వారి ఫోన్‌లను నేరస్తులకు అనుమతి ఇస్తున్నారు సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఎప్పుడూ ఎవరో ఒకరు మోసగాళ్ల బారిన పడుతున్న వార్తలు వింటూనే ఉన్నాం. ఇటీవల కేంద్ర హోం మంత్రిత్వ శాఖ లోక్‌సభలో వెల్లడించిన గణాంకాల ప్రకారం.. గతేడాది సైబర్ మోసగాళ్లు దేశవ్యాప్తంగా ప్రజల నుంచి ఏకంగా రూ.22,845 కోట్లను అక్రమంగా దోచుకున్నారు. ఇది ఏపీ రాజధాని అమరావతి కోసం ప్రభుత్వం ఖర్చు పెడుతున్న దాని కంటే ఎక్కువ. 2023లో సైబర్ నేరాల వల్ల రూ.7465 కోట్ల నష్టం జరగ్గా, 2024లో ఇది ఏకంగా 206 శాతం పెరిగినట్లు స్పష్టమవుతోంది.

ఈ పెరుగుదల సైబర్ నేరగాళ్ల ఆగడాలు ఎంతగా పెరిగిపోయాయో తెలియజేస్తోంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ లోక్‌సభలో మాట్లాడుతూ.. నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్, హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్లో మొత్తం 36.40 లక్షల ఆర్థిక మోసాల కేసులు నమోదయ్యాయని తెలిపారు.2023లో ఆర్థిక మోసాలకు సంబంధించి 24.4 లక్షల కేసులు నమోదయ్యాయి. ఈ సంఖ్యను బట్టి చూస్తే ప్రతేడాది ప్రజలు మోసపోతున్న ఘటనలు పెరుగుతున్నాయని స్పష్టమవుతోంది. నమోదైన మొత్తం సైబర్ నేరాల కేసుల సంఖ్యను పరిశీలిస్తే, 2024లో 22.7 లక్షల కేసులు నమోదయ్యాయి. కాగా, 2023లో ఈ సంఖ్య 15.9 లక్షలు మాత్రమే. ఇది ఏకంగా 42 శాతం పెరుగుదలను సూచిస్తోంది. ఇది నిజంగా షాకింగ్ విషయమే. ఈ గణాంకాలు సైబర్ సేఫ్టీ పట్ల మనం ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియజేస్తున్నాయి.సైబర్ నేరాలను అరికట్టడానికి భారత ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది 2019లో ప్రారంభించింది. ఆర్థిక మోసాలను వెంటనే నివేదించడానికి, మోసగాళ్లు డబ్బును దారి మళ్లించకుండా నిరోధించడానికి ప్రభుత్వం 2021లో సీఎఫ్?సీఎఫ్?ఆర్ఎంను ప్రారంభించారు. సీఎఫ్?సీఎఫ్? ఆర్ఎం ఇప్పటివరకు 17.8 లక్షలకు పైగా ఫిర్యాదులలో రూ.5489 కోట్లకు పైగా డబ్బును కాపాడగలిగింది. అంటే, మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా డబ్బును తిరిగి పొందడానికి అవకాశం ఉంది.

సైబర్ నేరగాళ్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. పోలీస్ అధికారుల సమాచారం ఆధారంగా కేంద్ర ప్రభుత్వం 9.42 లక్షలకు పైగా సిమ్ కార్డులను, 2,63,348 ఐఎంఈఐ నంబర్‌లను బ్లాక్ చేసింది. పోలీసులు ఇప్పటివరకు 10,599 మంది నిందితులను అరెస్టు చేశారు. దుబాయ్, చైనా, కంబోడియా, తైవాన్ వంటి దేశాల నుండి సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అయితే విదేశాలలో కూర్చొని ఉన్న సైబర్ మోసగాళ్ళు భారతీయ బ్యాంకు ఖాతాల ద్వారా మోసం చేస్తున్నారు. కోట్ల రూపాయల లావాదేవీలు చేయడానికి కరెంట్ ఖాతాలను ఉపయోగిస్తున్నారు. ఈ సైబర్ మోసగాళ్ల డబ్బు లావాదేవీల కోసం బ్యాంకు ఖాతాలను విక్రయించే ముఠా గుట్టు రట్టయింది. బ్యాంకు ఖాతాలను అమ్ముతున్న నిందితులు బెంగళూరు, బెంగళూరు గ్రామీణ ప్రాంతాలకు చెందిన సునీల్, ప్రకాష్, లక్ష్మీశ పుట్టస్వామయ్యలను పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ నిందితులకు విదేశాల్లో ఉన్న సైబర్ మోసగాళ్లతో సంబంధాలు ఉన్నాయి. నిందితులు బెంగళూరు, తుమకూరు, రామనగర, బెంగళూరు గ్రామీణ ప్రాంతాల్లోని రోజువారీ కూలీ కార్మికులు, మురికివాడల నివాసితులకు రూ.5,000 ఇచ్చి, వారి ఆధార్ కార్డులను ఉపయోగించి సిమ్ కార్డులు, చిన్న పారిశ్రామిక వ్యవస్థాపకులుగా చెప్పుకునే పత్రాలను సృష్టించేవారు.తర్వాత వారు దానిని ఉపయోగించి జాతీయం చేసిన బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలను తెరిచారు. ఆపై వారు బ్యాంకు ఖాతాలను, లింక్ చేసిన సిమ్ కార్డులను మోసగాళ్లకు ఇచ్చేవారు. ప్రతి ఖాతాను సైబర్ మోసగాళ్లకు రూ.50,000 కు అమ్మేవారు. ఈ ముఠా ఇప్పటివరకు 357 బ్యాంకు ఖాతాలను విక్రయించింది. సైబర్ మోసగాళ్లు ఈ బ్యాంకు ఖాతాల నుండి రూ.150 కోట్ల లావాదేవీలు చేశారు. నకిలీ బ్యాంకు ఖాతాలను తెరవడంలో కొంతమంది బ్యాంకు సిబ్బంది, మేనేజర్లు కూడా పాల్గొన్నారని దర్యాప్తులో వెల్లడైంది. సైబర్ మోసగాళ్ళు తాము మోసం చేసిన డబ్బులో 30 శాతం భారతదేశంలో ఖర్చు చేశారు. మిగిలిన 70 శాతం డబ్బును హవాలా ద్వారా బదిలీ చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసును ప్రస్తుతం సీసీబీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.సైబర్ మోసగాళ్లు రోజుకో కొత్త పద్ధతిలో మోసాలకు పాల్పడుతున్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి. అనుమానాస్పద లింకులు, ఈమెయిల్‌లకు దూరంగా ఉండాలి. కొత్త యాప్‌ను ఇన్‌స్టాల్ చేసేటప్పుడు అది కొన్ని అనుమతులు అడుగుతుంది. చాలా మంది వాటిని చదవకుండా అన్నింటికీ అనుమతించు అని ఒప్పుకుంటారు. ఇది చాలా ప్రమాదకరమని కూడా హెచ్చరించారు. స్క్రీన్ షేరింగ్ యాప్‌లు మీ ఫోన్‌లోని అన్ని కార్యకలాపాలను నేరస్తులకు చూపిస్తాయని ప్రస్తావించారు. ఉదాహరణకు, మీరు బ్యాంకు లావాదేవీలు చేస్తున్నప్పుడు వచ్చే ఓటీపీలను వారు చూసే అవకాశం ఉంది. అందుకే యాప్‌లకు అనుమతులు ఇచ్చే ముందు జాగ్రత్తగా చూసి పర్మిషన్ ఇవ్వాలన్నారు.సైబర్ నేరాలను నివారించడానికి సోషల్ మీడియా సీక్రెట్ సెట్టింగ్‌లు కూడా చాలా ముఖ్యమని గుర్తు చేశారు. ఈ క్రమంలో మీ సోషల్ మీడియా ఖాతాలలో సెట్టింగ్‌లను సరిచేసుకోవాలన్నారు. మీ వ్యక్తిగత సమాచారం అందరికీ కనిపించకుండా చూసుకోవాలన్నారు. ఉదాహరణకు మీ ఫోన్ నంబర్, చిరునామా, ఫోటోలు వంటివి అందరికీ బహిర్గతం కాకుండా పరిమితం చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల సైబర్ నేరస్తులు మీ సమాచారాన్ని దుర్వినియోగం చేయడం కష్టమవుతుందని గుర్తు చేశారు.స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లు, 2-ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఉపయోగించాలి. సురక్షిత వెబ్‌సైట్‌లను మాత్రమే ఓపెన్ చేయాలి. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ షేర్ చేయవద్దు. సాఫ్ట్‌వేర్, డివైజ్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోండి. పబ్లిక్ వై-ఫై ఉపయోగించవద్దు. ఈ జాగ్రత్తలు పాటించడం ద్వారా సైబర్ మోసాల బారిన పడకుండా మిమ్మల్ని మీరు రక్షించుకోవచ్చు.

# మారనున్న స్పీకర్, డిప్యూటీ స్పీకర్....






**విశాఖపట్టణం- సూర్య వాస్తవం, జూలై 25:** ఏపీలో రాజకీయ సంచలనం రేగనుందా? చంద్రబాబు క్యాబినెట్‌ను విస్తరించనున్నారా? 8 మంది మంత్రులను మార్చనున్నారా? స్పీకర్‌తో పాటు డిప్యూటీ స్పీకర్ మార్పు ఉంటుందా? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఇటీవల కాలంలో మంత్రివర్గ విస్తరణ ఉంటుంది అనేది బలమైన చర్చగా కొనసాగుతోంది. క్యాబినెట్లో చాలామంది మంత్రుల తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. పలుమార్లు చంద్రబాబు హెచ్చరికలు కూడా జారీ చేశారు. మారండి లేకపోతే మార్చేస్తానంటూ హెచ్చరించారు. అయినా సరే వారి పనితీరులో మార్పు రాకపోవడంతో ఇప్పుడు మార్పుకు సిద్ధపడుతున్నారని మీడియా కథనాలు వస్తున్నాయి. ముఖ్యంగా జూనియర్లతో క్యాబినెట్ ఏర్పాటు ప్రయోగం విఫలమయింది అన్న భావన సీఎం చంద్రబాబులో ఉన్నట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు సీనియర్లను పక్కనపెట్టి జూనియర్లకు అవకాశం ఇచ్చారు చంద్రబాబు. కేవలం లోకేష్ నాయకత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే విధంగా జూనియర్లకు ఛాన్స్ ఇచ్చారన్నది విశ్లేషకుల అభిప్రాయం. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు దాదాపు 15 మంది సీనియర్లు మంత్రి పదవులకు ఎదురు చూశారు. కానీ వారిని కాదని ఆయా జిల్లాల్లో ఉన్న జూనియర్లకు అవకాశం వచ్చింది. కళా వెంకట్రావు, గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, యనమల రామకృష్ణుడు, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, పరిటాల సునీత, జెసి ఫ్యామిలీ నుంచి.. ఇలా చాలామంది నేతలు పదవులు ఆశించారు. కానీ దక్కలేదు.అయితే జూనియర్ ఫార్ములా దెబ్బతినడంతో ఇప్పుడు సీనియర్లను తెరపైకి తేనున్నట్లు ప్రచారం నడుస్తోంది. ప్రధానంగా ఉత్తరాంధ్రలో ఇద్దరు మంత్రుల ఉద్వాసన తప్పదని తెలుస్తోంది. గోదావరి జిల్లాల నుంచి మరో ఇద్దరిని తప్పిస్తారని సమాచారం. రాయలసీమతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి ఓ నలుగురిని తప్పిస్తారని కూడా ప్రచారం జరుగుతోంది. అంటే ఎనిమిది మంది మంత్రుల ఉద్వాసన తప్పదని తేలింది. ఇప్పటికే ఒక మంత్రి పదవి క్యాబినెట్లో ఖాళీగా ఉంది. అంటే మొత్తం తొమ్మిది మంత్రి పదవులకు గాను.. ఒకటి జనసేనతో పాటు మరొకటి బిజెపికి కేటాయించే అవకాశం ఉంది. అంటే ఏడు మంత్రి పదవులను టిడిపి సీనియర్లకు దక్కే ఛాన్స్ కనిపిస్తోంది.అయితే మరోవైపు స్పీకర్ తోపాటు డిప్యూటీ స్పీకర్ సైతం క్యాబినెట్ లోకి వెళ్తారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆది నుంచి మంత్రి పదవి పై ఆశలు పెట్టుకున్నారు.

కానీ అనూహ్యంగా ఆయనకు స్పీకర్ పదవి కట్టబెట్టి నోరు మూయించారన్న వ్యాఖ్యలు వినిపించాయి. ఎందుకంటే అయ్యన్న పాత్రుడు రాజకీయంగా చాలా దూకుడుగా ఉండేవారు. ఆయనకు మంత్రి పదవి ఇస్తే విపక్షంపై ఓ రేంజ్ లో ప్రతాపం చూపుతారని ఒక కామెంట్ ఉంది. మరోవైపు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజుకు సైతం క్యాబినెట్లోకి తీసుకుంటారని.. ఆయన స్థానంలో గోరంట్ల బుచ్చయ్య చౌదరికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇస్తారని మరో టాక్ ఉంది. అయితే స్పీకర్ గా బీసీ వర్గానికి చెందిన నేతను తీసుకుంటారని.. అయ్యన్నపాత్రుడుకు మంత్రి పదవి ఖాయమని జోరుగా ప్రచారం సాగుతోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి. రాజకీయంగా ఎక్కువగా వైఫల్యం 2024 ఎన్నికల్లో ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమికి అధికారం కట్టబెట్టారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే ఎమ్మెల్యేలు సైతం క్షేత్రస్థాయిలో పనిచేయాల్సి ఉంటుంది. మంత్రుల సైతం మరింత మెరుగ్గా పనిచేస్తేనే ఆ ఫలితాలు అందుకోగలమని చంద్రబాబు చెబుతూ వచ్చారు. కానీ క్షేత్రస్థాయిలో పట్టు తప్పుతోందన్న అంచనాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రివర్గంలో చేర్పులు, మార్పులు చేపట్టాలని చంద్రబాబు భావిస్తున్నట్లు ప్రచారం ప్రారంభం అయ్యింది. అయితే ఏపీ సీఎం చంద్రబాబు కు ఒక అలవాటు ఉంది. ఏదైనా చేయాలంటే ముందుగా దానిపై విస్తృత చర్చ జరగాలని భావిస్తారు. అది పార్టీ వర్గాలతో పాటు ప్రజల్లో విస్తృత చర్చ ద్వారా ఆ నిర్ణయంలో మార్పులు, చేర్పులు ఉంటాయి. అయితే ప్రస్తుతం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందా? అన్నదానికి.. ప్రభుత్వ వర్గాల నుంచి లేదని సమాధానం వస్తోంది. అయితే నిప్పు లేనిదే పొగ రాదు అని అడిగేవారికి టిడిపి శ్రేణులనుంచి వింత సమాధానం వస్తోంది. తమ అధినేత వ్యూహం ప్రకారం ఏదైనా జరుగుతుందని.. తొందరపాటు ఉండదని.. అలాగని కీలక నిర్ణయాలు కూడా ఉంటాయని గుర్తు చేస్తున్నారు.చంద్రబాబు ప్రయోగాలకు ఇష్టపడతారు. ఇది చాలా సందర్భాల్లో చూసాం కూడా. 2024 ఎన్నికల్లో కొత్తదనాన్ని చూపించారు. కొత్త టీం తో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. సామాజిక సమీకరణలను పరిగణలోకి తీసుకున్నారు. కొత్తగా ఎమ్మెల్యేలు గెలిచిన పదిమందికి మంత్రులుగా అవకాశం ఇచ్చారు.

అయితే మంత్రులు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదన్న విమర్శ ఉంది. ముఖ్యంగా ప్రతిపక్షాలను రాజకీయంగా తిప్పి కొట్టలేక పోతున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. శాఖల ప్రగతి కంటే రాజకీయంగా ఎక్కువగా వైఫల్యం చెందుతున్నారు అన్నది చంద్రబాబు బాధగా తెలుస్తోంది. ఇప్పటికీ చాలా మంది మంత్రులు తమ సొంత జిల్లాలపై పట్టు సాధిం చలేకపోయారు. అందుకే చంద్రబాబు అసంతృప్తి చెందుతున్నట్లు తెలుస్తోంది. అయితే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రచారం పుణ్యమా అని ఆశా వహులు ముందుకు వస్తున్నారు. ఎవరికివారుగా తమ ప్రయత్నాల్లో ఉంటున్నారు. కానీ ప్రభుత్వ వర్గాల్లో మాత్రం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ పై ఎటువంటి కదలిక లేదు. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# పిఠాపురం పవన్... మంగళగిరి లోకేష్

## స్ట్రాంగ్ గా నియోజవకర్గాలు



**కాకినాడ - సూర్య వాస్తవం**

రాజకీయ పార్టీల నేతలు తమ నియోజక వర్గాలను పదిలం చేసుకోవాలని ప్రయత్నిస్తారు. అయితే అందులో కొందరు మాత్రమే సక్సెస్ అవుతారు. పులివెందులలో వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం, కుప్పంలో చంద్రబాబు, హిందూపురంలో నందమూరి కుటుంబం.. ఇలా నేతల ప్రత్యేక నియోజకవర్గాలు అంటూ ఉంటాయి. అయితే ఇప్పుడు సొంత నియోజకవర్గాల్లో పాతుకు పోవాలని చూస్తున్నారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్. కుప్పం, పులివెందుల మాదిరిగానే తమ నియోజకవర్గాలను కంచు కోటలుగా మార్చుకోవాలని చూస్తున్నారు. పెద్ద కోటను ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఆ నియోజకవర్గాల అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు ఆ ఇద్దరు నేతలు. ఒకవైపు రాష్ట్ర మంత్రులుగా ఉంటూనే తమ నియోజకవర్గాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేసి ప్రజల మనసు గెలవాలని చూస్తున్నారు.పవన్ కళ్యాణ్ 2019 ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేశారు. గాజువాక తో పాటు భీమవరంలో పోటీ చేసి రెండు చోట్ల ఓడిపోయారు. ఒక విధంగా చెప్పాలంటే దారుణ పరాజయం చవిచూశారు. ఇది రాజకీయ ప్రత్యర్థులకు వరంగా మారింది. ప్రచార అస్త్రంగా మార్చుకున్నారు. అయితే అక్కడే గుణపాఠాలు నేర్చుకున్నారు పవన్ కళ్యాణ్. గెలుపు కోసం పరితపించారు. అందుకే ఎన్నికలకు ముందు వ్యూహాత్మకంగా పిఠాపురం నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. గాజువాక, తిరుపతి వంటి నియోజకవర్గాలు చర్చకు వచ్చాయి కానీ.. పిఠాపురం అయితే సేఫ్ జోన్ లో నిలవాలని భావించారు. అక్కడే గెలిచారు. ఇప్పుడు ఆ నియోజకవర్గాన్ని తనకు కంచుకోటగా మార్చుకోవాలని చూస్తున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలను అభివృద్ధి చేసి చూపిస్తున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నారు. అదే సమయంలో పిఠాపురం లో సొంత ఇంటిని నిర్మించుకున్నారు. మరోవైపు తమ కుటుంబ సభ్యులు, సన్నిహితులు సైతం అక్కడ ఉండే విధంగా చర్యలు చేపడుతున్నారు. మొత్తానికి అయితే పిఠాపురం నియోజకవర్గాన్ని కంచుకోటల జాబితాలో చేర్చాలని గట్టి ప్రయత్నం లో ఉన్నారు పవన్ కళ్యాణ్.ఇంకోవైపు లోకేష్(సైతం మంగళగిరి నియోజకవర్గం పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. దాదాపు 50 వేల ఇల్లు కట్టించేందుకు ప్రణాళిక రూపొం దించారు. పెద్ద ఎత్తున పరిశ్రమలను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ నియోజకవర్గంలో చేనేత కార్మికులు అధికం. అందుకే చేనేత హబ్ గా మార్చాలని ప్రణాళికల రూపొందించారు. అందుకు సంబంధించి ప్రోత్సాహకంగా చేనేత శాలను ఏర్పాటు చేశారు. ఐటీ, నాన్ ఐటి పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానికంగానే 50 వేల మంది పనిచేసే విధంగా వాటిని తీర్చిదిద్దనున్నారు. ఇంకోవైపు ప్రభుత్వ భూముల్లో ఇళ్లను నిర్మించుకున్న వేలాదిమందికి.. ఇళ్ల పట్టాలు అందించేందుకు కూడా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి 2019 ఎన్నికల్లో మంత్రిగా ఉంటూ మంగళగిరిలో బరిలో దిగారు లోకేష్. అయితే ఈ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. ఆపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ అభ్యర్థి గెలుస్తూ వస్తున్నారు. అటువంటి నియోజకవర్గాన్ని ఎంచుకొని సాహసం చేశారు. కానీ లోకేష్ ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. దీంతో 2024 ఎన్నికల్లో మరో నియోజకవర్గానికి మారాలని సీనియర్లు సూచించారు. కానీ మంగళగిరి నియోజకవర్గాన్ని గెలిచి టిడిపికి గిఫ్టుగా ఇస్తానని చెప్పుకొచ్చారు లోకేష్. అన్నట్టుగానే 90 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఇప్పుడు ఆ నియోజకవర్గాన్ని కంచుకోటగా మార్చుకోవాలని చూస్తున్నారు.వచ్చే ఎన్నికల్లో కూటమిగా ముందుకు వెళ్లడం ఖాయం. అందుకే మూడు పార్టీలు తమకు పట్టున్న 100 నియోజక వర్గాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాయి. ఆ నియోజక వర్గాల్లో ఎట్టి పరిస్థితుల్లో పట్టు తప్పకూడదని భావిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో అభివృద్ధిపై దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. అందులో భాగంగా కుప్పం, మంగళగిరి, హిందూపురం, పిఠాపురం వంటి నియోజకవర్గాల్లో ప్రత్యర్థులు పోటీ చేయడానికి కూడా భయపడే విధంగా అభివృద్ధి చేసి చూపించాలని భావిస్తోంది. చూడాలి మరి ఎన్నికల ఫలితాల్లో ప్రభావం ఎలా ఉంటుందో..

# మెట్రో రైలు నిధులు కేంద్రమే భరించాలి

- 80,515 మెట్రిక్ టన్నుల యూరియాను వెంటనే కేంద్రం రాష్ట్రానికి సరఫరా చేయాలి
- ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి
- ఉపాధి హామీ వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుపై పునరాలోచించాలి
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడి



**వేంపల్లి – సూర్య వాస్తవం, జూలై 25:** విశాఖ, విజయవాడ మెట్రో రైలు సౌకర్యాన్ని కేంద్రమే 100 శాతం నిధులతో ఏర్పాటు చేయాలని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్ర వారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ విభజన చట్టం,13వ షెడ్యూల్ ప్రకారం విశాఖ, విజయవాడ మెట్రో రైలు సౌకర్యాన్ని కేంద్ర ప్రభుత్వం కేంద్ర నిధులతో విభజన జరిగిన సంవత్సరం లోపు కల్పించాలి. పది సంవత్సరాలు పైబడినా కేంద్రం లోని మోడీ ప్రభుత్వం పట్టించుకోక పోవడం గర్హనీయం. 50 శాతం నిధులు కేంద్రం,50 శాతం నిధులు రాష్ట్రం భరించేటట్లు టెండర్లు పిలవాలని గురువారం రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించడం శోచనీయం. దీనివలన రాష్ట్ర ఖజానాపై విపరీతమైన ఆర్థిక భారం పడుతుంది. మొదటి దశకే రాష్ట్రంపై రూ 10,808 కోట్ల భారం పడుతుంది. ఇప్పటికే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉంది. ఈ నిర్ణయంతో రాష్ట్రం శాశ్వతంగా అప్పుల ఊబిలోకి పోతుంది. డబులింజన్ సర్కార్ ట్రబులింజన్ సర్కార్గా మారడం శోచనీయం. 100 శాతం కేంద్ర నిధులతో ఏర్పాటు చేసేటట్లు మోదీ ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. **యూరియా కొరత:** రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. ఈ ఖరీఫ్‌కుగాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానిక ి1,30,000 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించింది. కానీ ఇప్పటివరకూ కేవలం 49,485 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. ఇంకా 80,515 మెట్రిక్ టన్నులు రావలసి ఉంది. వెంటనే 80515 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని కేంద్ర ప్రభు త్వానికి తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఫీజ్ రియంబర్స్‌మెంట్ గత 6 క్వార్టర్లుగా ఫీజ్ రియంబర్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం కాలేజీలకు విడుదల చేయలేదు. 2024 మొదటి క్వార్టర్ నుండి బకా యిలున్నాయి. రూ.6400 కోట్ల బకాయి లున్నాయి. కాలేజీల యాజ మాన్యాలు సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, కరెంటు బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతున్నాయి. సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థుల మీద ఒత్తిడి చేస్తున్నాయి. విద్యార్థులపై చదువులకు పోలేక, ఉద్యోగాలకు పోలేక ఇబ్బంది పడుతున్నారు. వెంటనే రూ.6400 కోట్ల బకాయిలు విడుదల చేయాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ఉపాధి కూలీల వేతనాలు**

పది వారాలుగా ఉపాధి హామీ కూలీలకు వేతనాలు అందలేదు. వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వానికి తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**సెంట్రలైజ్డ్ కిచెన్లు**

మండలానికొక సెంట్ర లైజుడు కిచెన్ ఏర్పాటు చేసి అక్కడనుండి మండలంలోని అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం వల్ల మధ్యాహ్న భోజన కార్మికులు ఉపాధి కోల్పోతారు. ప్రభుత్వం పునరాలోచించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం పరిశ్రమలను తరిమికొట్టింది

- రాష్ట్రంలో పరిశ్రమలు తిరిగి రావడానికి ముఖ్యమంత్రి కష్టపడుతున్నారు
- విద్య విలువలు తెలిసిన విద్యామంత్రి నారాలోకేష్
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, జులై 25:** ఐదు నిమిషాలు దావోస్లో చంద్రబాబుతో మాట్లాడి ఆయన విజన్ నచ్చి ఆరు నెలల్లోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి యూఏఈ ఆర్థిక పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ రావడం, ఇతర పెద్ద దిగ్గజ కంపెనీల పారిశ్రామిక వేత్తలు రావడం చంద్రబాబు నాయుడు గొప్పతనం అని గాజుల ఖాదర్ భాషా పేర్కొన్నారు. శుక్రవారం నాడు పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాటా డుతూ గత ప్రభుత్వం పరిశ్రమలను తరిమి కొట్టిందని పరిశ్రమలు తెచ్చి నిరు ద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడానికి చంద్రబాబు నాయుడు రాత్రింపగళ్లు కష్టపడుతు న్నారని తెలిపారు. జగన్ ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులు ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకున్నారని, ఏపీని సర్వనాశనం చేశారని పది లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టి అప్పుల ఆంధ్ర ప్రదేశ్గా మార్చారని ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో చంద్రబాబు నాయుడు అభివృద్ధి సంక్షేమం వైపు నడిపిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు చంద్రబాబు కృషితో మైక్రోసాఫ్ట్ సంస్థ అమెరికా తర్వాత బయటి దేశాలలో తన మొదటి కార్యాలయాన్ని హైదరాబాదులో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పుడు అదే విధంగా లోకేష్ కృషితో గూగుల్ సంస్థ అమెరికా తర్వాత బయటి దేశాలలో తన అతి పెద్ద డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేస్తుందని తెలిపారు. మరొక పక్క తండ్రికి తగ్గ తనయుడిగా నారా లోకేష్ బాబు విద్యాలయాలను విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడేలా తీర్చిదిద్దారని తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థల్ని తలదన్నేలా ఉన్న యూనిఫాం బూట్లు బెల్టు బ్యాగు పుస్తకాలతో ప్రభుత్వ విద్యార్థుల ఆత్మవిశ్వాసంతో చదువుల్లో పోటీ పడతామంటూ వస్తున్నారంటే దానికి గర్వకారణం నారా లోకేష్ బాబు అని తెలిపారు. విద్యార్థుల శారీరక మానసిక ఆరో గ్యానికి ఆటపాటలు ఎన్సిసి స్కూళ్ళలో అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. ఈ విధంగా విద్యార్థుల భవిష్యత్తు కొరకు నారా లోకేష్ బాబు కష్టపడుతుంటే మరొకపక్క విదేశాలకు వెళ్లి పరిశ్రమలు తెచ్చి తద్వారా నిరుద్యోగ సమస్యలు నిర్మూలించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తుంటే ఆంధ్ర రాష్ట్రం పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందుతుందని మరొకపక్క విద్యార్థుల భావితరానికి భావి పౌరులు కాబట్టి విద్య విలువ తెలిసిన నారా లోకేష్ బాబు గారు తీర్చిది ద్దుతుంటే ఓర్వలేక వైసిపి నాయకులు తప్పుడు ప్రచారం చేయడం వారికి సమంజసం కాదు అని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి మట్టి శ్రీనివాసులు నాయుడు, జయరామిరెడ్డి శివారెడ్డి, రోఫా ఇర్షాద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపన వల్లనే ఆర్థిక ప్రగతి సాధ్యం

- జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, జూలై 25:** జిల్లాలో విస్తృతంగా పరిశ్రమల స్థాపన జరగాలని తద్వారా ఆర్థిక ప్రగతి సాధించవచ్చునని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 60వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఏపిసి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించి వారికి సకాలంలో సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమ తులను అందజేసి పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న పథకాల గురించి కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. గత నెల లో జరిగిన సమావేశం నుంచి ప్రస్తుతం ఏక గవాక్ష విధానంలో 224 ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోగా 25 దరఖాస్తులను ఆమోదించారు. మిగిలిన 16 దరఖాస్తులను కూడా సత్వరమే పరిశీలించి వాటిని కూడా ఆమోదించాలని ఇన్చార్జి కలెక్టర్ ఆదేశించారు. సింగల్ విండో పోర్టల్‌లో పారిశ్రామిక వేత్తలు దరఖాస్తులు చేసుకున్న అనుమతులను నిర్ణిత సమయంలో ఆమోదించాలని జిల్లాలో 20 20-20 23, 20 23- 27 పాలసీలో 13 యూనిట్లకు గాను రూ. 230 లక్షల 54,540 సబ్సిడీ మంజూరుకు సమావేశంలో ఆమోదం తెలిపారు. పీఎం ఈజీపి పథకం ద్వారా లబ్ధి పొంది విజయవంతంగా నడుస్తున్న వారి విజయ గాథలు క్రోడీకరించిన వాటిని జిల్లా పరిశ్రమ శాఖ అధికారి కలెక్టర్ కు అందజేయగా దీనిపై ఇన్చార్జి కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కులో ఏర్పాటు చేయడానికిఅనువైన స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయబోతున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబుద్వారా యువతకు టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, స్కిల్ ట్రైనింగ్ ఇచ్చే విధంగా ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్, ఏడి రాజశేఖర్ రెడ్డి, వాణిజ్య శాఖ కృష్ణారెడ్డి, ఆర్టీవో వీర్రాజు, ఏపీఐఐసీ మేనేజర్ మల్లికార్జున, డిఎస్ డి ఓ ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

## మెరుగైన విధులతో మంచి సేవలు అందించండి

- జిల్లా ఎస్పీ పి.జగదీష్



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూలై 25:** ఏఎస్సైలు నుండీ ఎస్సైలుగా పదోన్న తులు కల్పించాం. మెరుగైన విధులతో ప్రజలకు మంచి సేవలు అందించాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ సూచించారు. అనంతపురం జిల్లాలలో పని చేస్తున్న 1990 బ్యాచ్ కు చెందిన 24 మంది ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి కల్పించారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులతో కలిసి పదోన్నతి పొందిన ఎస్సైలు శుక్రవారం ఎస్పీ ని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యుడు మరియు ఎస్సైగా పదోన్నతి పొందిన సాకే త్రిలోక్ నాథ్ జిల్లా ఎస్పీ గారికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనతి కాలంలోనే వేగంగా పదోన్నతులు ఇవ్వడంలో జిల్లా ఎస్పీ తీసుకున్న చొరవ, కృషి పట్ల వీరంతా హర్షం వ్యక్తం చేశారు. పదోన్నతి పొందిన ఎస్సైలతో పాటు జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీలు స్వయం సంరక్షణ పద్ధతులు నేర్చుకోవాలి





**కుప్పం– సూర్య వాస్తవం, జూలై 25:** స్వయం సంరక్షణ పద్ధతులు నేర్చుకోవడం ద్వారా స్త్రీలు ఆపద సమయాలలో తమను తాము కాపాడుకోవచ్చునని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి చిదంబరం విద్యార్థులకు సూచించారు. హైదరాబాద్ అభయ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో శుక్రవారం స్త్రీల భద్రత మరియు స్వీయ రక్షణ అనే అంశంపై అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం స్త్రీ సాధికారత విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ సిరాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అభయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ టీవీ రమణ ఆడపిల్లలు ఇతరుల మీద ఆధారపడకుండా తమను తాము కాపాడు కోవడానికి అవలంబించవలసిన పద్ధతులపై అవగాహన కల్పించారు. అదే విధంగా ఆపద సమయంలో 1098 లేదా 100 నెంబర్లకు ఫోన్ చేయడం ద్వారా రక్షణ పొందవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి. నారాయణమూర్తి, అభయ ఫౌండేషన్ సభ్యులు శివాజీ, రామ్మూర్తి, అధ్యాపకులు ప్రదీప్ కుమార్, డాక్టర్ చంద్రబాబు, సాలమ్మ, శశి కుమార్, ఇతర అధ్యాపకులు , విద్యార్థినులు పాల్గొన్నారు.

## పట్టుబడిన అవినీతి జలగ

- ఏసీబీ వలలో దుర్గం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్



**రాయదుర్గం – సూర్య వాస్తవం, జూలై 25:** కళ్యాణదుర్గం ఇన్ చార్జ్ సబ్ రిజిస్ట్రార్ నారాయణ స్వామిపై ఏసీబీ దాడులు. రూ.5 లక్షలు లంచం తీసు కుంటుండగా పట్టుకున్న అధికారులు. ఓ స్థలం రిజిస్ట్రేషన్ కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారి నాగేంద్ర నుంచి డబ్బులు డిమాండ్ చేసిన నారాయణస్వామి. మున్సిపాలిటీ పరిధిలోని స్థలాన్ని అగ్రికల్చర్ ల్యాండ్ కింద రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్. రిజిస్ట్రేషన్ అనంతరం లంచం ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్న సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి, రియల్ ఎస్టేట్ వ్యాపారి. డబ్బులు డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నాగేంద్ర. ఈ క్రమంలో నాగేంద్ర అనిశాను ఆశ్రయించాడు. వ్యాపారి నుంచి నిందితుడు లంచం తీసుకుంటుండగా అనిశా డీఎస్పీ తన సిబ్బంది సాయంతో పట్టు కున్నారు. నిందితుడిని కల్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకెళ్లి విచారిస్తున్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**రాప్తాడు– సూర్య వాస్తవం, జూలై 25:** రాప్తాడు నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ కింద ఎమ్మెల్యే పరిటాల సునీత సాయం అందించారు. వెంకటాపురం లోని తన క్యాంపు కార్యాలయంలో 7 మందికి రూ.5 లక్షల 11 వేలు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే సునీతకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఇది తమకు ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోంది అని తెలిపారు. కొన్ని సార్లు అత్యవసర పరిస్థితుల్లో ఆరోగ్య శ్రీ వర్తించని వాళ్ళు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతుంటారన్నారు. ఇలాంటి వారికి కూడా అండగా ఉండాలన్న ఉద్దేశ్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నారన్నారు.

# ఇంటి వద్దకే రేషన్ పంపిణీ

## - ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, జూలై 25:** జిల్లాలో 65 సంవత్సరాలు పైబడిన వారికి అలాగే వికలాంగులకు, మంచానికే పరిమితమైన వారికి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేసే ప్రకియను వేగవంతం చేసి సకాలంలో 100 శాతం పూర్తి చేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ ఆదేశించారు. శుక్ర వారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పౌర సరఫరా, విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు, ఇతర అంశాలపై ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సిఎస్డిటిలు, ఎంఈఓలు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సంద ర్భంగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆయా ఎఫ్.పి షాపుల పరిధిలో 65 సంవత్సరాలు పైబడిన వారికి, వికలాంగులకు, మంచానికే పరిమితమైన వారికి సంబంధించి 30వ తేదీ లోపల పూర్తిస్థాయిలో రేషన్ సరుకులను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రేపటి లోగా వీలైనంతగా రేషన్ సరుకుల పంపిణీ చర్యలు పూర్తి కావాలని, ఇంటి వద్దకే రేషన్ పంపిణీలో వెనుకబడిన మండలాలు వెంటనే రేషన్ సరుకులను త్వరగా అందజేయాలన్నారు. సివిల్ సప్లయిస్ అంశాలకు సంబంధించి ఈ సర్వీసెస్ పై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఎఫ్.పి షాపుల రెన్యూవల్, మెంబర్ డిలీషన్ ఇన్ రైస్ కార్డ్, కరెక్షన్ ఆఫ్ రాంగ్ ఆధార్ సీడింగ్, రైస్ కార్డు అప్పగింత, రైస్ కార్డుల విభజన, రైస్ కార్డ్ యూనిట్స్ ఈ-కేవైసీ, తదితర అంశాలకు సంబంధించి పెండింగ్ ను వెంటనే పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ప్రతి నెలలో ఎఫ్ పి .షాపులు, పెట్రోల్ బంకులు గ్యాస్ ఏజెన్సీల తనిఖీలు నిర్వహించి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఇన్చార్జ్ కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి, విజిలెన్స్ సిఐ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ శంకర్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్లు వినతి పత్రంతో పాటు కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించండి



**రాయదుర్గం - సూర్య వాస్తవం, జూలై 25:** రాయదుర్గంలో విచ్చలవిడిగా పాస్టర్ల అవ తారమెత్తిన కొంతమంది సూడో పాస్టర్లు రెండు వర్గాలుగా విడిపోయి తమ తమ వర్గానికి స్మశాన వాటికను, చర్చిల నిర్మా ణానికి స్థలాలను కేటాయించాలని అధికా రులను, ప్రజా ప్రతినిధులను కలిసి పోటా పోటీగా వినతి పత్రాలు ఇవ్వడం అందరికీ తెలిసిన విషయమే. అయితే స్మశాన వాటికలకు, చర్చి నిర్మాణాలకు స్థలాల కేటాయింపు కోసం వినతి పత్రాలు ఇస్తున్నప్పుడు వినతి పత్రంతో పాటు మీ కుల ధ్రువీకరణ పత్రాలు సమ ర్పించగలరా అని విశ్వహిందూ పరిషత్ పాస్టర్లను సూటిగా ప్రశ్నిస్తోంది. అంతే కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఇలాంటి సూడో పాస్టర్లు ఇచ్చే వినతి పత్రాలకు కుల ధ్రువీకరణ పత్రాలు కూడా జోడించి ఇచ్చేలా ఆదేశించాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేస్తున్నది. చట్టంపై గౌరవం లేకుండా, చట్టమంటే భయం లేకుండా తమ తమ కుల ధ్రువీకరణ పత్రాలతో అన్ని సౌలభ్యాలు పొందుతూ పాస్టర్లుగా చలామణి అవు తుండడం సబబు కాదని, ధర్మాన్ని నమ్ముకుని తమ కులాన్ని గౌరవిస్తూ కొనసాగుతున్న వారికి మీరు అన్యాయం చేస్తున్నారని విశ్వ హిందూ పరిషత్ తెలియజేస్తున్నది. మీరు నిజమైన పాస్టర్లైతే మతమార్పిడి తర్వాత చట్ట ప్రకారం మీ కుల ధ్రువీకరణ పత్రాన్ని సరి చేసుకోవాల్సిన అవసరం ఉందని విశ్వహిందూ పరిషత్ గట్టిగా సూచిస్తున్నది.

# హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 25:** ప్రతి ఒక్కరు ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ సూచనల మేరకు పి సి ఎస్ ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ మరియు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు 25 జూలై 2025న అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాలలో ప్రసాద్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది ఎలా వ్యాపించదు ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలను తెలిపారు. పి సి ఎస్ ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చెన్నారెడ్డి గారు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్నచూపు చూడకుండా సమాజంలో కలిసిమెలిసి జీవించే విధంగా సహకరించాలని ఆయన కోరారు. ఎయిడ్స్ వ్యాధి సుఖ వ్యాధుల యొక్క వివరాలను తెలియజేశారు కండోమ్ యొక్క ఉపయోగాలు తెలియ జేశారు. అలాగే మాదక ద్రవ్యాల గురించి విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. తరువాత ప్రాజెక్ట్ మేనేజర్ స్వాతి మాట్లాడుతూ ఎయిడ్స్ యాక్ట్ 2017 ఏ ఆర్ టి మందులు ఏపీ ఎస్ఏసిఎస్ యాప్ టోల్ ఫ్రీ నెంబర్ 1097 తెలియజేశారు. గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎం.ప్రకాష్ మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్ గురించి మాదక ద్రవ్యాల గురించి మాట్లాడుకున్న విషయాలను గుర్తుచేస్తూ భవిష్యత్తులో విద్యార్థులు ప్రయోజకులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రిన్సిపాల్ వి.చంద్రశేఖర్, పి.గోపాల్, పిసిఎస్ఎస్ ఏఎన్ఎం యు.ప్రవీణ ఈ. అలేఖ్య, జె. సుహాసిని, బి. విజయలక్ష్మి పీర్ ఎడ్యుకేటర్ కె.ఖాదర్ వల్లి ఎన్ఎస్ఓస్ కో- ఆర్డినేటర్స్ ఈవికుమార్, బాలమురళీ క్రిష్ణ, కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

## - జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, జూలై 25:** జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి శాఖ సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్‌సిఓఆర్‌డి (నార్కో కోఆర్డినేషన్ సెంటర్) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ మాట్లా డుతూ... మాదక ద్రవ్యాల వినియోగించడం వల్ల జరిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టవలసిన అవసరం ఉందన్నారు.

ముఖ్యంగా జిల్లాలో డ్రగ్స్, గంజాయి తదితర మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రభుత్వ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలకు సంబంధించి గంజాయి సాగు లాంటివి ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1972 కు సమా చారం అందించాలని తెలిపారు. అలాగే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యాసంస్థలు, హాస్టల్స్, కాలేజీలు, యూనివర్సిటీలు తదితర ప్రాంతాల్లో కూడా టోల్ ఫ్రీని ఏర్పాటు చేసి డ్రగ్స్ సరఫరా, విని యోగం లేకుండా గట్టి నిఘా పెంచి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ వార్డు సచివాలయాల ద్వారా కూడా డ్రగ్స్ సంబంధిత సమాచారం సేకరించి ఆయా శాఖలకు సమాచారం అందించాలని అలాగే ప్రజల్లో కూడా



వీలైనంతగా అవగాహన కల్పించాలని ఇన్చార్జి కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శాఖ ఈ అంశంలో తీసుకున్న చర్యలపై ప్రతి మాసానికి ఒకసారి నివేదికను అందజే యాలన్నారు. డ్రగ్స్ కేసులో ఎదుర్కొంటున్న బాధితులకు కౌన్సిలింగ్, డి- అడిక్షన్ సెంటర్స్ ద్వారా సహాయం అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా డ్రగ్స్ విభాగం అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ, డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు తమ నియంత్రణ ప్రాంతంలో ఉన్న మెడికల్ ఏజెన్సీలు మరియు మెడికల్ షాపులలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎన్ .ఆర్. ఎక్స్. డ్రగ్స్ ఇవ్వకూడదని స్పష్టంగా చెప్పి అందుకు సంబంధించి రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయించుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయం వద్ద డ్రగ్స్ వ్యసనం నియంత్రణకు సంబంధించిన ప్రచార అవగాహన గోడ పత్రికలను, ఈగల్ ట్రోఫీ నంబర్ ఉన్న ప్రచార సామాగ్రిని అతికించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పట్టణ డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ డిఎస్పి వెంకటేశ్వర్లు, డి సి ఆర్ బి.సిఐ హరినాథ్, ఈగల్ వింగ్ ఇన్‌స్పెక్టర్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల

# విధులను యధావిధిగా కొనసాగించాలి

## - సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్



**రాయదుర్గం - సూర్య వాస్తవం, జూలై 25:** రాయదుర్గం పురపాలక సంఘంలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న పనులను మార్పులు చేస్తూ మున్సిపల్ కమి షనర్ తీసుకున్న నిర్ణయం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, తక్షణమే కమిషనర్ స్పందించి ఇంజనీరింగ్ కార్మికులకు పాత పద్ధతిలోనే యధావిధిగా వారికి పనులను అప్పగించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం వారు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలలో రాయదుర్గం పురపాలక సంఘానికి అనేకమంది కమిషనర్లు మారారు గాని, ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న పనుల పట్ల ఈ కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని ఏ ఒక్క కమిషనర్ కూడా తీసుకోలేదని అలాంటిది ఈ కమిషనర్ గారు ఇంజనీరింగ్ కార్మికులకు పనులను మార్పులు చేస్తూ తీసుకున్న నిర్ణయం కార్మికులను తీవ్ర ఇబ్బందుల్లో నువ్వు చేసేలా ఉందని అన్నారు. గత 20 సంవత్సరాలు నుండి ఇంజనీరింగ్ కార్మికులు ఈ స్థానంలో అయితే పనులు చేస్తున్నారో అదే స్థానంలోనే ఉండి ఇప్పటివరకు కార్మికులు పనులు చేశారని, అయితే ఈ కమిషనర్ మాత్రం కావాలనే ఉద్దేశంతో కార్మికులను ఇబ్బందులకు గురి చేసేలా ఈ రకంగా నిర్ణయం తీసుకోవడం సరైనది కాదు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగినటువంటి నిరవధిక సమ్మెలో రాయదుర్గం మున్సిపాలిటీలో విధుల నిర్వర్తిస్తున్న ఇంజ నీరింగ్ కార్మికులు కమి షనర్ చెప్పినటువంటి మాటకు కట్టబడి పనిచేయలేదనే ఒకే ఒక కారణంగా కార్మికు లను ఈ రకంగా ఇబ్బందులకు గురిచేసేలా కమిషనర్ గారు నిర్ణయం తీసుకోవడం సరైనది కాదు.

ఈ పనుల చేర్పుల మార్పులలో కూడా గత సమ్మె సందర్భంగా పాల్గొన్న టువంటి కార్మికులను మాత్రమే టార్గెట్ చేస్తూ వారిని, ప్రస్తుతం వారు పనులు చేస్తున్నటువంటి ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వారిని పనులు చేయాలని మార్పు చేయడం ఇది కక్ష సాధింపు చర్ల లో భాగమేనని మండి పడ్డారు. కార్మికుల సమస్యలపై పోరాటం చేయడమే నేరంగా ఈ కమిషనర్ భావించడం హాస్యాస్పదంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా కొంతమంది కార్మికులకు మాత్రం ఎటువంటి పని ప్రదేశాన్ని మార్చకుండా కేవలం సమ్మెలో పాల్గొన్నటువంటి కార్మికులను మాత్రమే పని ప్రదేశాల్లో మార్పులు చేయడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. కావున ఇప్పటికైనా ఈ మున్సిపల్ కమిషనర్ స్పందించి తక్షణమే పాత పద్ధతిలోనే యధావిధిగా కార్మికులకు వారు చేసే ప్రదేశం లోనే పనులను అప్పగించాలని లేనిపక్షంలో కార్మికుల పట్ల కమిషనర్ చూపు తున్నటువంటి ఈ కక్ష సాధింపు చర్యలకు వ్యతిరేకంగా సిఐటి ఆధ్వర్యంలో పోరా టాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూని యన్ అధ్యక్షులు తిప్పేరుద్ర, కార్మికులు పాల్గొన్నారు. వీరు చేస్తున్న నిరసనకు ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు మద్దతును తెలుపుతూ పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనకు,


# అన్నసంతర్పణకు బియ్యం విరాళం

## - విరాళం వితరణ చేసిన వాల్మీకి సంఘం అధ్యక్షులు



**రాయదుర్గం - సూర్య వాస్తవం, జూలై 25:** రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో బియ్యం విరాళం వితరణ చేశారు. శుక్రవారం రాయదుర్గం పట్టణంలోని తన స్వగృ హంలో ఆ సేవా సమితి ఉపాధ్యక్షులు మలకన్న, న్యాయ సలహాదారులు న్యాయవాది రవి చంద్ర సభ్యులతో కలిసి విరాళం అందజేశారు. రాయదుర్గం మండలం డి.కొండా పురంలో ఆదివారం శ్రీ పల్లకి రంగనాథస్వామి విగ్రహ ప్రతిష్టాపన విషయమై స్వామివారి భక్తమండలి సభ్యులు, గ్రామ పెద్దలు వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు బండి ని కలుసుకొని స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన విషయమై తెలియపరచి విరాళం కోరారు. అందుకు సమ్మతించిన ఆయన వాల్మీకి సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు అన్న సంతర్పణ కోసం 8 బ్యాగులు బియ్యం విరాళంగా అందించారు. విరాళం అందుకున్న స్వామివారి భక్తమండలి సభ్యులు మాట్లా డుతూ కుల, మత రాజకీయాలకతీతంగా అడిగిన తక్షణం తన వంతు సహాయంగా విరాళం అందించి తన దృక్పథం ను చాటుకున్నారని వారు కొనియాడారు. తాను కష్టించి సంపాదించిన సంపాదనలో దేవాలయాలకు, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలకు, పేదల వివాహాలకు, అన్న సంతర్పణ కార్యక్రమాలకు కాదనకుండా విరాళం అందజేస్తూ అన్ని సామాజిక వర్గాల వారి నుండి మనసున్న వ్యక్తిగా మన్ననలు పొందడం అభినందించదగ్గ విషయమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంక్షేమ సేవా సమితి మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, మీడియా సలహాదారులు బోయపాటి ప్రకాష్, సభ్యులు అజయ్ టైలర్ రఘు, తిప్పేస్వామి, లాలెప్ప, మిత్రులు విశ్రాంతి ఉద్యోగి గొల్ల గోపాల్, చిరు వ్యాపారి గాజుల భీమరాజు, శ్రీ పల్లకి రంగనాథ స్వామి భక్తమండలి సభ్యులు మాజీ సర్పంచ్ రామ్మూర్తి, హనుమంతు, ఆంజనేయులు, గంగాధర్, వెంకటేశులు, నాగరాజు, హనుమంతప్ప, చంద్రన్న పాల్గొన్నారు.

# హంద్రీనీవా గురించి మాట్లాడే హక్కు జగన్ రెడ్డికి లేదు






**రాప్తాడు - సూర్య వాస్తవం, జూలై 25:** హంద్రీనీవాతో పాటు రాయలసీమలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్ రెడ్డికి లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కనగానపల్లి మండలం కె.ఎన్.పాళ్యం పంచాయతీ శివపురం గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేకు టిడిపి నాయకులు గ్రామ ప్రజలు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. గ్రామం లో ఇప్పటి వరకు ఎంత అభివృద్ధి చేశాం ఎన్ని సంక్షేమ పథకాలు అందించామన్న వివరాలతో ఇంటింటికీ వెళ్లారు. ప్రతి ఇంటి వద్ద సాదరంగా స్వాగతం పలుకుతూ తమకు పథకాలు అందాయన్న సంతోషాన్ని లబ్ధిదారులు ప్రజలు వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో నిర్మించిన గోకులం షెడ్లను ప్రారంభిం చారు. అలాగే కనగానపల్లి మండలంలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి గురించి వివరించారు.ఇంకా రానున్న నాలుగేళ్లలో ఏం చేస్తామన్నది చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం తొలి ఏడాదిలోనే అన్ని హామీలు నెరవేర్చిన ప్రభుత్వం టిడిపి ప్రభుత్వం ఒక్కటే అన్నారు.

అన్నదాత సుఖీభవ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం త్వరలో అమలవుతాయన్నారు. రైతులకు అండగా ఉండాలన్న ఉద్దేశ్యంతోనే ఖరీఫ్ సీజన్ లోనే రైతుల ఖాతాల్లో డబ్బు వేస్తున్నట్టు చెప్పారు. తల్లికి వందనం ఇంకా కొందరికి అందలేదని చెబుతున్నారు. వాళ్ళ వివరాలు ఇప్పటికే ప్రభుత్వం తీసుకుందని వారికి కూడా త్వరలోనే డబ్బు జమ అవుతుందన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు నుంచి జిల్లాకు ఇప్పటికే నీరు చేరింది. గతం కన్నా ఎక్కువగా ఈ ఏడాది రాప్తాడు నియోజ కవర్గానికి నీరు తీసుకునే అవకాశం ఉందన్నారు. అయితే వైసీపీ నాయకులు మాత్రం హంద్రీనీవా విషయంలో ఈ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గు చేటన్నారు. అసలు హంద్రీనీవా ప్రాజెక్టు ఎక్కువ భాగం టీడీపీ అధికారంలో ఉండగానే జరిగిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో ఫేజ్-1 ఫేజ్-2కు కలిపి రూ.13,635 కోట్లకు పరిపాలనా అను మతులు ఇచ్చారన్నారు. రూ.11,535 కోట్ల వరకు టీడీపీ ప్రభుత్వంలోనే హంద్రీనీవాకు ఖర్చు చేశారన్నారు. 2014-19లో హంద్రీ నీవా ప్రాజెక్టుకు రూ.4,182 కోట్లు ఖర్చు చేసి 80 శాతం పనులు పూర్తి చేశామన్నారు. కాలువ విస్తీర్ణాన్ని 10 మీటర్ల నుంచి 16.5 మీటర్ల వెడల్పు చేసి 40 టీఎంసీల నీరు తరలించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. 2019- 24లో జగన్ రెడ్డి 5 ఏళ్లల్లో రూ.515.78 కోట్లు మాత్రమే హంద్రీనీవాకు ఖర్చు చేశారన్నారు.

రాయలసీమ బిడ్డ అని చెప్పుకొని సీమకే అన్యాయం చేసిన వ్యక్తి జగన్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏడాదిలోనే హంద్రీనీవా ఫేజ్1 ఫేజ్ 2 కి రూ.3873 కోట్లు ఖర్చు చేశామన్నారు. కాలువ వెడల్పుతో 3,850 క్యూసెక్కులకు నీటి సామర్థ్యం పెరిగిందన్నారు. దీని ద్వారా వీలైనంత ఎక్కువ నీరు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఈసారి కచ్చితంగా రాప్తాడు నియోజవర్గంలో అన్ని చెరువులకు నీరు అందిస్తామని తెలియజేశారు.

### మద్యం కుంభకోణం కేసులో

# త్వరలో పెద్ద తలకాయలు బయటకొస్తాయి

- సిట్ అన్ని ఆధారాలతోనే ముందుకెళ్తోంది :ఎమ్మెల్యే దగ్గుపాటి
- 13వ డివిజన్ ఉమా నగర్‌లో ఎమ్మెల్యే సుపరిపాలనలో తొలి అడుగు
- అభివృద్ధి చూసి ఓర్వలేకనే వైసీపీ నాయకుల విమర్శలు
- రెడ్ బుక్ అమలు చేసి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్న ఎమ్మెల్యే



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 25:** మద్యం కుంభకోణంలో త్వరలో పెద్ద తలకాయలు బయటికి వస్తాయని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. 13వ డివిజన్ ఉమానగర్ లో ఆయన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి రేణుకా యల్లమ్మ గుడి వద్ద నుంచి ఇంటింటికి వెళ్తూ ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యేకు ప్రజల నుంచి మంచి స్పందన కనిపించింది. సంక్షేమ పథకాలు అందుకున్న తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే స్థానికంగా ఉన్న సమస్యలను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కొన్నిచోట్ల సాంకేతిక కారణాలతో పథకాలు అందలేదని ప్రజలు చెప్పారు. ఈ విషయాన్ని వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్క రిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తొలి ఏడాదిలోనే దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని దగ్గుపాటి అన్నారు. ఇది చూసి ఓర్వలేకనే వైసిపి నాయకులు ఇష్టం వచ్చినట్లు విమర్శిస్తున్నారన్నారు. ప్రజల్లో ఎక్కడ మాకు మంచి పేరు వస్తుందన్న ఆందోళన వైసిపి నాయకుల్లో కనిపిస్తోందన్నారు. గతంలో ఎవరూ చూడని, వినని విధంగా మద్యం కుంభకోణానికి పాల్పడ్డారన్నారు ఇందులో కేందిస్తాయి నాయకుల దగ్గర నుంచి అధికారులు, మిథున్ రెడ్డి లాంటి వారు కూడా ఉన్నారన్నారు. సిట్ అన్ని ఆధారాలతో అరెస్టులు చేస్తోందన్నారు. మిథున్ రెడ్డి అరెస్ట్ కూడా ఇందులో భాగమేనన్నారు. త్వరలో ఈ కేసులో పెద్ద తలకాయలు కూడా అరెస్టు అవుతాయని ఎమ్మెల్యే అన్నారు. మిథున్ రెడ్డి మొదటినుంచి ఒక దొర లాగా వ్యవహరిస్తుంటారని.. ఆయనకు జైల్లో కూడా దొర లాగానే ఉండాలని కోరుకుంటున్నారన్నారు. కానీ కోర్టు ఆదేశాల ప్రకారం జైల్లో సౌకర్యాలు కల్పిస్తారని స్పష్టం చేశారు. రెడ్ బుక్ అమలు చేసి ఉండి ఉంటే ఈరోజు పరిస్థితి వేరే లాగా ఉండేదన్నారు. మా పార్టీ వారికి మానవత్వం ఉందన్నారు. ఈ ఏడాది కాలంలోనే వైసీపీ నాయకులే చాలా మంది టిడిపి నాయకులను పొట్టన పెట్టుకున్నారన్నారు. జగన్ రెడ్డి ఒక మానవత్వం లేని నాయకుడని.. అందుకే తన వాహనం టైర్ కింద వ్యక్తి చనిపోతే కూడా శవాన్ని పక్కకు పడేసి పర్యటన సాగించారని ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో 13వ డివిజన్ టిడిపి నాయకులు నారాయణ స్వామి, బండి కాశీ విశ్వనాథ్, నర్మదా, నాయుడమ్మ, రామకృష్ణ, సురేష్, నాగార్జున, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల నరసింహులు, పరమేశ్వర్, కడియాల కొండన్న, బొమ్మినేని శివ, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకట నారాయణ, తెలుగుమహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్, టిడిపి నాయకుడు రాయల్ మధు, కార్పొరేటర్లు జనబలం బాబా, బాలాంజనేయులు, టిఎన్టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మోహన్ కుమార్, బెస్త సాధికార సమితి రాష్ట్ర నాయకుడు చేపల హరి, మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి, టిడిపి నాయకులు నెట్టెం బాలకృష్ణ, రూపనగుడి రవి రాయల్, మణి రవి, వడ్డే భవాని తదితరులు పాల్గొన్నారు.

### వేపూరి కోట గ్రామ సమస్యను

# పరిష్కరించిన జిల్లా కలెక్టర్

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 25:** పిజిఆర్ఎస్ వేదిక ద్వారా వేపూరి కోట గ్రామానికి సంబంధించిన అర్జీ పై ఆ గ్రామాన్ని ఆకస్మికంగా సంద ర్శించి ఆ సమస్యను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పరిష్కరించారు. ములకలచెరువు మండలం వేపూరి కోట గ్రామానికి చెందిన రత్నమ్మ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందించిన అర్జీని పరిష్కరించేందుకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి శుక్రవారం ఉదయం ఆ గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రత్నమ్మ అందజేసిన అర్జీపై మండల తహశీల్దార్‌ను ప్రజలను వివరాలు అడిగి అర్జీలో పేర్కొన్న



రహదారి, జిల్లా ఆర్ అండ్ బి (రహదారులు, భవనాల) శాఖకు చెందినదిగా తేల్చి సమస్యను పరిష్కరించారు. అనంతరం ఆర్ అండ్ బి బోర్డులను ఏర్పాటు చేయవల సిందిగా తాసిల్దారును ఆదేశించారు. ఈ తనిఖీలో మదన పల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, ములకలచెరువు తహశీల్దార్, తదితరులు పాల్గొన్నారు.





## ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ మరువలేను

**రాప్తాడు - సూర్య వాస్తవం, జూలై 25:** ఆరోజు నా తండ్రి ఇచ్చిన ప్రోత్సాహం సప ాకారమే నన్ను ఇంత దూరం తీసుకొచ్చిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలో ధర్మవరపు కొండన్న 5వ వర్ధంతి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఘాట్ వద్ద ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ కుటుంబ సభ్యులు శ్రేయోభిలాషులతో కలసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. పాఠశాల విద్యార్థులకు బుక్స్ పెన్సిల్స్ వాటర్ బాటిల్స్ వంటి సామాగ్రి అంద జేశారు. ఆ తర్వాత యల్లమ్మ అమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత తన తండ్రితో ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చిన్నప్పటి నుంచి ఆయన ప్రోత్సాహం వలనే ఈ స్థాయికి వచ్చానన్నారు.పరిటాల రవి మరణం సమయంలో నా తండ్రి నాకు ఎంతో అండగా నిలిచి మనో ధైర్యాన్ని ఇచ్చారన్నారు. ఒక ప్రజా ప్రతినిధిగా ప్రజలకు సేవ చేయడం చూసి ఎంతో ఆనందించే వారని అన్నారు.ఈ కార్యక్రమంలో ధర్మవరపు మురళి బాలాజీ, కుటుంబ సభ్యులు టిడిపి నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు ప్రజలు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లి సొసైటీ అభివృద్ధి కృషి చేస్తాం

**- చైర్మన్ అప్ప వేణు, సొసైటీ డైరెక్టర్ డీసీ కొండ చిన్న పెద్దయ్య**

**- ఘనంగా సత్కరించిన టిడిపి యువ నాయకులు గంగసాని మోహన్**





**పత్తికొండ - సూర్య వాస్తవం, జూలై 25:** ఉప్పర్లపల్లి సొసైటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని సొసైటీ చైర్మన్ అప్ప వేణు, సొసైటీ డైరెక్టర్ డిసి కొండ చిన్న పెద్దయ్య అన్నారు. శుక్రవారం నాడు ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొని వారిని టిడిపి తెలుగు యువత నాయకులు శభాష్ పురం గ్రామానికి చెందిన గంగసాని మోహన్ ఘనంగా సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లా డుతూ...సొసైటీ అభివృద్ధి రైతులు శ్రేయస్సు కోసం కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## అడ్వాన్సు తీసుకున్న ఇంటి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి

**వీరబల్లి - సూర్య వాస్తవం, జూలై 25 :**



మండలంలోని ఎన్టీఆర్ గృహాలకు సంబం ధించి నిర్మాణంలో ఉంటూ అడ్వాన్స్ తీసుకున్న పక్కా గృహాలను వెంటనే పూర్తి చేయా లని వీరబల్లి మండల హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు అన్నారు. మండల వ్యాప్తంగా 88 ఇళ్లకు సంబంధించి అడ్వాన్స్ తీసుకోగా ఇందులో 48 ఇల్లు పూర్తి చేసుకున్నాయని మిగతా 40 ఇల్లు అమావాస్యలోగా పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయని ఆయన అన్నారు. కావున లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి అసంపూర్తిగా ఉన్న ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని ఆయన తెలియజేశారు. ఆయనతోపాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్ సిబ్బంది ఉన్నారు.

## గ్రామపంచాయతీ పరిధిలో 100 శాతం చెత్త సేకరణ జరగాలి

**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

**- వేపూరి కోటలోని వ్యర్థపదార్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, జూలై 25: గ్రామపంచాయతీ పరిధిలో 100 శాతం చెత్త సేకరణ జరగాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను సిబ్బందిని ఆదేశించారు. ములకలచెరువు మండలం వేపూరి కోట లోని వ్యర్థపదార్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి శుక్రవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యర్థపదార్థాల ప్రాసెసింగ్ కేంద్రంలోకి తడి చెత్త పొడి చెత్త లను వేరు చేసి తీసుకురావాలని, గ్రామపంచాయతీలోని అన్ని కుటుంబాల నుండి చెత్త సేకరణ జరగాలని పంచాయతీ సెక్రటరీని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని కుటుంబాల నుండి చెత్త సేకరణ జరిగేందుకు అవసరమయ్యే గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసుకోవాలని, ఏమైనా ఖాళీలు ఉంటే వాటిని వెంటనే భర్తీ చేసుకొని 100శాతం చెత్త సేకరణ జరగాలని ఎంపీడీవోను, పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు. ఈ తనిఖీలో మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, ములకలచెరువు తహశీల్దార్, మండల ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.



## నాబార్డు సేవలు భేష్

**- ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి**





**ప్యాపిలి - సూర్య వాస్తవం, జూలై 25:** మండల పరిధిలోని కలచట్ల గ్రామంలో శుక్రవారం నాబార్డ్ ఆధ్వర్యంలో కోటి ఏనభై లక్షల రూపా యలతో నాబార్డ్ సంస్థ గ్రామ ంలో అబివృద్ధి పనులు నిర్వహి స్తున్నది, అందులో భాగంగా డోన్ నియో జకవర్గ శాసనసభ్యులు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి తాను ఇచ్చిన మాట ప్రకారం బోర్ వేయించడం జరిగింది. ఆర్వో వాటర్ ప్లాంట్ కొరకు నాబార్డ్ వారు మూడు లక్షల రూపాయలతో 1000 లీటర్ల సామర్థ్యంతో ఆర్వో వాటర్ ప్లాంట్ ను నిర్మించడం జరిగింది. ఎమ్మెల్యే కోట్ల, నాబార్డ్ ఏజీఎం కేడియం. కార్తీక్ లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి కలచట్ల గ్రామానికి బహుకరించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ గ్రామంలో నాబార్డ్ సేవలు భేష్ అని సంస్థ ను అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, తహసీల్దార్ భారతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, పిఆర్ ఏఈ ప్రభాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రమాదేవి, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు,ఖాజా పీర్ , సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ ఐ మధుసూదన్, గ్రామ టిడిపి నాయకులు బత్తుల రమేష్ రెడ్డి, కలచట్ల ప్రసాద్,డీసీసీబీ శివ లీలా, ప్రెసిడెంట్ దామోదర్ రెడ్డి, రాకేష్, సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. అనంతరం నాబార్డ్ ఏజిఎమ్ కార్తీక్ మాట్లాడుతూ...గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తూ అన్ని రకాలుగా ఆదుకుంటామని కలచట్ల గ్రామానికి ఇంకా నాలుగు సంవత్సరాలు నాబార్డ్ సంస్థ రైతులకు పొలాలలో, వాగులలో చెక్ డ్యాములు నిర్మించి అన్ని విధాలుగా గ్రామాన్ని అబివృద్ధి చేసి మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్క సాగరం లక్ష్మిరెడ్డి, ప్యాపిలి మండల టిడిపి ఇన్చార్జ్ ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, మాజీ ఎంపీటీసీ రాంమోహన్ యాదవ్, గడ్డం ప్రసాద రెడ్డి, కొంగనపల్లి మధు, ప్రిన్సిపాల్ మధు, వాటర్ షెడ్ చైర్మన్ రాజా భూపతి, ట్రెజరర్ రవికుమార్,సెక్రటరీ శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ విశ్వనాథ్ యాదవ్, తలారి చిన్న రామాంజనేయులు, భీమన్న,పెద్ద రామాంజి నేయులు, కాటినేని నాగరాజు, నాగరాజు యాదవ్, మహేందర్, తిమ్మ నాగేంద్ర, జనసేన సునీల్ తదితర టిడిపి, జనసేన,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## నింగి నుంచి శక్తి టీమ్స్ నిఘా





**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 25:** జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు మహిళలపై నేరాలు, ఈవ్ టీజింగ్‌లు జరుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. శుక్రవారం నాడు బుక్కరాయసముద్రం సి.ఐ పుల్లయ్య, మహిళా విభాగం సి.ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అనంతపురం శివారు ప్రాంతాలలో నేరాలకు చెక్ పెట్టిన శక్తి టీమ్స్, ఆయా పోలీసులు. అనంతపురం నగరంతో పాటు బుక్కరాయ సముద్రం, పరిసరాలలో డ్రోన్లు ఎగుర వేశారు. నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను, తోటలు, బహిరంగ ప్రదేశాలను, పార్కుల వద్ద ప్రాంతాలపై డ్రోన్స్ పంపి, నిఘా ఏర్పాటు చేపట్టారు

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- ఎమ్మెల్యే జయ సూర్యప్రకాశ్ రెడ్డి**





**ప్యాపిలి - సూర్య వాస్తవం, జూలై 25 :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని డోన్ నియోజకవర్గం శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి, కర్నూలు, నంద్యాల ఉభయ జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్ లు అన్నారు. శుక్రవారం పట్టణంలో డీసీఎంఎస్ డిస్టిక్ మేనేజర్ రాజేష్, డైరెక్టర్ శరణ్య ఆధ్వర్యంలో నూతన డిసిఎంఎస్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, వై. నాగేశ్వరావు యాదవులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమది రైతు ప్రభుత్వమని, రైతు సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని, ప్యాపిలి మండల రైతుల కోసం ఏర్పాటు చేసిన నూతన డీసీఎంఎస్ కార్యాలయ సేవలను రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. అనంతరం రైతులకు యూరియా ను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమం లో లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్,తొప్పెల శ్రీనివాసులు,బత్తుల రమేష్ రెడ్డి, ఖాజా పీర్, రామ్మోహన్ యాదవ్,గడ్డం ప్రసాద రెడ్డి, నడిగడ్డ నాగేంద్ర, కొంగన పల్లె మధు, ప్రిన్సిపాల్ మధు, వార్డుమెంబర్ వెంకటేష్, జక్కసానికుంట్ల మహేష్ యాదవ్, తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలి

- మల్లానూరును సందర్శించిన కడ బృందం సభ్యులు
- త్వరలో అభివృద్ధి పనులు ఆరంభం
- డీజీ నెర్వ్ సెంటర్ ఒక చరిత్ర
- విద్యుత్ సైకిళ్లను అందుకున్న లబ్ధిదారులు

:కడ పీడీ వికాస్ మర్మత్





**కుప్పం-సూర్య వాస్తవం, జూలై 25 :** కుప్పం మండలం మల్లానూరు గ్రామాన్ని శుక్రవారం నాడు కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థ బృందం సందర్శించారు. కడ పిడి వికాస్ మరమ్మత్ ఆధ్వర్యంలో జరిగిన పర్యటనలో భాగంగా గ్రామ పరిధిలో పలు ప్రభుత్వ భవనాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, సచివాలయ కార్యాలయాన్ని సందర్శి ంచారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందిస్తున్న సేవల పై ఆరా తీస్తూ, ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన డిజిటల్ నెర్వ్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రారంభం ఒక చరిత్ర అని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మారుమూల గ్రామాలలోని ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలను అందించాలన్న సదుద్దేశంతో టాటా సంస్థ సహకారంతో ముఖ్యమంత్రి డిజిటల్ నెర్వ్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే మల్లాలూరు అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతామని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ పరిధిలో నిరుపయోగంగా ఉన్న ఆధునిక భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి ఇప్పటికే ప్రణాళిక సిద్ధమైందని, ఈ ప్రణాళికను కడ పీడి సహకారంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం అత్యవసర పనులను గుర్తించిన కడ పీడి వాటిని పూర్తి చేయడానికి 50 లక్షల రూపాయలు నిధులను విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. చివరగా మహిళలకు విద్యుత్ సైకిళ్ళ పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి పాలకమండలి సభ్యులు శాంతారామ్, కడ సలహా మంటని సభ్యులు రామచంద్ర, మండల టిడిపి అధ్యక్షులు ప్రేమ్ కుమార్, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.



# పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టం

**- ఐసీడీఎస్ పీడీ నాగమణి**



**అనంతపురం - సూర్య వాస్తవం, జూలై 25 :** అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టం ఉద్దేశమని ఐసీడీఎస్ పీడీ నాగమణి అన్నారు. అనంతపురంలోని బీసీ స్టడీ సర్కిల్ లోని సమావేశ భవన్ లో ఫైట్ ఫర్ రైట్స్, సమాచార హక్కు చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శు క్రవారం ఏర్పాటు చేసిన సదస్సులో సీడీపీఓలకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీడీ నాగమణి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం సవ్యంగా పని చేయాలన్నా, అవినీతిని అరికట్టాలన్నా, ప్రభుత్వాలు, ప్రభుత్వ శాఖలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టం తీసుకువచ్చిందని ఆమె వివరించారు. పౌరులకు విషయ పరిజ్ఞానం ఉండడం, సమాచారంలో పారదర్శకత చాలా ముఖ్యమని పేర్కొన్నారు. సమాచార హక్కు అధికార యంత్రాంగం విధులను చక్కగా వివరించారు. శాఖాపరమైన అంశాల గురించి ఏదైనా సమాచారం కావాలని ఎవరైనా దరఖాస్తు చేస్తే ఎలా వ్యవహరించాలో ఆమె స్పష్టంగా తెలిపారు.

జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల సీడీపీఓలతో పాటు పీడీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్లు బాబా నూరుద్దీన్, ధనలక్ష్మి హాజరయ్యారు.సీడీపీఓలతో ప్రత్యేక సమావేశం అనంతరం తన ఛాంబర్‌లో సీడీపీఓలతో ఐసీడీఎస్ పీడీ నాగమణి సమావేశ. అనేక అంశాలపై చర్చించారు. సమావేశంలో ఐసీడీఎస్ ఎక్స్ టెన్షన్ ఆఫీసర్ ఖాజీ రఫీమున్నీసా పాల్గొన్నారు.

### సాంకేతిక విప్లవానికి

# అనుగుణంగా పాఠ్య ప్రణాళిక రూపకల్పన


- క్వాంటం టెక్నాలజీని అందిపుచ్చుకునేలా పాఠ్యాంశాల నిర్మాణం జరగాలి
- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య మధు మూర్తి




**అమరావతి - సూర్య వాస్తవం, జూలై 25:** ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక విప్లవం నిత్య నూతనంగా కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత తరుణంలో విద్యార్థుల భవితకు భరోసానిచ్చేలా పాఠ్య ప్రణాళిక రూపకల్పన జరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య మధు మూర్తి పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుండి కొత్త పాఠ్య ప్రణాళిక ప్రకారం పాఠ్య ప్రణాళిక సవరణ ప్రక్రియకు సంబంధించి ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా మూడు రోజుల వర్క్ షాప్(కార్యశాల) శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆచార్య మధు మూర్తి ప్రారంభోపన్యాసం చేస్తూ నూతనంగా అమల్లోకి రానున్న పాఠ్య ప్రణాళిక చట్రంలో “11 కోర్ పేపర్లతో మేజర్, 4ఎలక్టివ్ పేపర్లు, 6 మైనర్ ఉంటాయని పేర్కొన్నారు. మొత్తం 12 సబ్జెక్టులకు సంప్రదాయ డిగ్రీ ప్రోగ్రామ్ ల మోడల్ సిలబస్ తయారీ కమిటీలు ఏర్పాటు చేసి పాఠ్య ప్రణాళిక సవరణ ప్రక్రియను వర్క్ షాప్ ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. క్వాంటం టెక్నాలజీని అందిపుచ్చుకునేలా సిద్ధం కావాలి సాంకేతిక విప్లవంలో భాగంగా ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా క్వాంటం టెక్నాలజీ గురించి చర్చ జరుగు తోందని నేటితరం విద్యార్థులు ఆ టెక్నాలజీని అందిపుచ్చు కోవడానికి అనుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన చేయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని మధు మూర్తి గుర్తు చేశారు.

విద్యార్థులు ఉద్యో గార్థుల ుగానే మిగిలి పోకుండా.., పారిశ్రామి కవేత్తలుగా, సంపద సృష్టికర్తలుగా ఎదగాలంటే సాంకేతిక శోభతో కూడిన విద్యా విధానం అవసరమని, నూతన విద్యా విధానం (ఎన్ ఈ పి-2020)కూడా అదే సూచిస్తోందని ఆయన స్పష్టం చేశారు. మేజర్ కోర్ కోర్సులు ఎలక్టివ్‌లతో సరిపోలాలని, ఆన్‌లైన్ విధానం ద్వారా మరిన్ని క్రెడిట్‌లను సంపాదించడానికి విద్యార్థులకు ఛాయిస్ ఇవ్వవచ్చని ఆయన అన్నారు. మేజర్, మైనర్లలో టెక్నాలజీని ప్రవేశపెట్టడం ద్వారా సత్ఫలితాలను సాధించవచ్చు అన్నారు. నైపుణ్య అభివృద్ధిని కూడా తీసుకురావచ్చు అని పేర్కొన్నారు. సిలబస్ ని రూపొందించేటప్పుడు కమిటీలో ఉన్న సబ్జెక్ట్ నిపుణులు బ్లూమ్స్ టాక్సోనమీ మరియు రూబ్రిక్స్ లాంటి అధునాతనమైన పద్ధతుల్ని ఉపయోగించి సమగ్రమైన పాఠ్యాంశాలను తయారు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి టీవీ శ్రీకృష్ణమూర్తి, కో ఆర్డినేటర్ డాక్టర్ జి.రోశయ్య, జి.శ్రీరంగం మాథ్యూ తదితరుల పాల్గొన్నారు.


# వైయస్ షర్మిలను కలిసిన గౌని ప్రతాప్ రెడ్డి





**రాయదుర్గం - సూర్య వాస్తవం, జూలై 25:** వైయస్ షర్మిలను మర్యాద పూర్వకంగా కలిశారు గౌని ప్రతాప్ రెడ్డి. రాయదుర్గం రైతు రక్షణా వేదికను స్థాపించి అన్నదాతల సమస్యల నివారనే ధ్యేయంగా రాజకీయ అరంగేట్రం చేసి తనదైన శైలిలో అతి తక్కువ కాలంలో ప్రజాభిమానాన్ని చురగొన్న నాయకుడని గుర్తించి తమ పార్టీకి ఆహ్వానించి రాయ దుర్గం నియోజకవర్గం బాధ్య తలు అప్పగిం చ్చినం దుకు కృతజ్ఞతలు తెలుపుతూ... షర్మిలా, డీ సీ సీ అధ్యక్షులు మధు సూదనరెడ్డి తనపై ఉంచుకున్న నమ్మ కాన్ని నిల బెట్టు కుంటానని శుక్రవారం నాడు న్యాయవాది గౌని ప్రతాప్ రెడ్డి పత్రికా ప్రకటనను విడుదల చేశారు. వారితో పాటుగా పలువురు నాయకులు పార్టీలో చేరారు, వీరి వెంట రాయదుర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్, ఎన్ ఎస్ యూ ఐ జోసెఫ్, దేవిరెడ్డిపల్లి లోకనాథ్ రెడ్డి, మంజు, రాజు తదితరులు ఉన్నారు.

# సంతకం ఫోర్జరీ కేసులో ఐదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు



**ఆదోని - సూర్య వాస్తవం, జూలై 25:** వంశ పారపర్యం నుంచి వచ్చిన పొలంకు సంబంధించిన వారసుల సంతకం ఫోర్జరీ చేసిన ముఠా గుట్టును రట్టు చేశారు పెద్దకడబూరు ఎస్సై నిరంజన్ రెడ్డి..... అసలు వివరాల్లోకి వెళితే....కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన బోయ ముద్దమ్మ కు పెద్దకడబూరు మండలం రాగిమాను దొడ్డి గ్రామంలో 6 ఎకరాలు పొలం ఉంది. ఆమె మరణం అనంతరం ఆమె వారసులు మొత్తం ఎనిమిది మందికి ఆ యొక్క భూమి చెందాల్సి ఉంది కానీ వారసులలో ఒక కూతురు అయిన బంగి సరిత , ఆమె భర్త తిరుమల నాయుడు కలిసి ఒక దానవిక్రయపు అగ్రిమెంటును ను ఎమ్మిగనూరుకు చెందిన డాక్యుమెంట్ రైటర్ సత్యనారాయణ తో తయారుచేయించి ఇద్దరి వారసుల సంతకాలను ఫోర్జరీ చేసి ఆ దానవిక్రయపు అగ్రిమెంటును ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన నొటరీ మురళి తో అవిడవిట్ తయారు చేయించి గ్రామ విఆర్ఓ అయినా విక్రమ్ రెడ్డి తో కలిసి మొత్తం భూమిని బంగి సరిత పేరు మీద రెవెన్యూ రికార్డులలో ముటేషన్ చేశారు. ఈ విషయమై ఆదోని సబ్ కలెక్టర్ కి పెద్దకడుబురు ఎస్ఐ నిరంజన్ రెడ్డి కి ఫిర్యాదు చేయగా. ఎస్సై సంబంధిత ఐదు మంది పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# జన్మదిన వేడుకల్లో రాష్ట్ర టీటీడీ కార్యనిర్వాహక కార్యదర్శి

### - టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు





**అన్నమయ్య బ్యూరో - సూర్యవాస్తవం, జూలై 25:** రాయచోటి పట్టణం మసాపేటలో సంపత్ సాయి హరీష్(నాని) కుమారుడు సంపత్ వెంకట్ సాయి రిత్విక్ 2వ జన్మదిన వేడుకల్లో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు హాజరై రిత్విక్ ను ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉరి వేసుకొని మహిళ ఆత్మ హత్య



**మదనపల్లె -సూర్యవాస్తవం, జూలై 25:** ఉరి వేసుకొని మహిళ ఆత్మ హత్య చేసుకున్న విషాదకర సంఘటన శుక్రవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. రెండవ పట్టణ పోలీసుల కథనం మేరకు.. మదనపల్లి పట్టణం బస్సునికొండ పుంగునూరు రోడ్డులో కాపురం ఉంటున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ రఫీ భార్య షేక్ పర్వీన్ (35) భర్తతో గొడవపడి మనస్థాపానికి గురైంది.అనంతరం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించడంతో కుటుంబీకులు బాధితురాలని స్థానిక ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి, అప్పటికే పర్వీన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రహీం తెలిపారు.

# బేలోడులో తెలుగు తమ్ముళ్లదే బలం

### - ఘన స్వాగతం పలికిన బేలోడు గ్రామ ప్రజలు
### ఉత్సాహంతో చిందులేసిన ప్రజలు





**రాయదుర్గం - సూర్య వాస్తవం, జూలై 25:** గుమ్మగట్ట మండలం బేలోడు గ్రామంలోని శుక్రవారం ఏడాది సుపరిపాలన సూపర్ సిక్స్ పథకాలపై గడప గడపగడపకు ప్రభుత్వ విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులును గజమాలతో ఘన స్వాగతం పలికారు యువ నేత బేలోడు సంజీవ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి సుపరిపాలన తొలి అడుగు ప్రతి గడపగడపకు వెళ్లి ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అన్న విషయంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు ప్రజలు సానుకూలంగా స్పందించి ప్రభుత్వ పథకాలు సూపర్ సిక్స్ లో భాగంగా మాకు అందుతున్న ఇస్తారంటూ సమాధానం ఇచ్చారు గ్రామంలోని పెద్ద ఎత్తుగా ర్యాలీని ఏర్పాటు చేసి డిజె సౌండ్ తో ప్రజలు మహిళలు పురుషులు చిన్నపిల్లలు గంతులేశారు ఉత్సాహంతో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించి ఉల్లాసంతో ముగించుకున్నారు ఈ సందర్భంగా కాలువ మాట్లాడుతూ నీలుడు గ్రామానికి సూపర్ సిక్స్ పథకాలు ఎక్కువ శాతం అందాయని మండలంలోని పెద్ద ఎత్తున ప్రభుత్వం నుంచి సాయం పొందుకున్న గ్రామం బేలోడు గ్రామం గోవుల షెడ్డులు రోడ్లు ప్రజలకు సానుకూలంగా అందాయి అయితే రాబోయే ఎన్నికల్లో మన పార్టీని గెలిపించి మరిన్ని మంచి అవకాశాలు పొందుకోవాలని కోరారు మార్కెట్ యార్డ్ చైర్మన్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు ప్రజలందరికీ అందాయని నమ్ముతున్నాము ముందున్న రోజులు మంచి రోజులు వస్తాయి స్థానిక ఎన్నికల్లో మన పార్టీని గెలిపించండి అని మాట్లాడారు సన్నన్న మండల గిరిమల్లప్ప బేలోడు సంజీవ మాట్లాడుతూ గ్రామంలో సుపరిపాలన అందినది గ్రామ ప్రజలందరూ కూడా పార్టీని ఆశీర్వదించి రాబోయే రోజుల్లో మంచి పరిపాలన కొరకు ఎదురు చూడాలని పార్టీ బలోపేతం కొరకు ప్రత్యేక కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత్ రెడ్డి మండల కన్వీనర్ గిరిమలప్ప క్లస్టర్ ఇంచార్జ్ కాలవ సన్నన్న బేలోడడు సంజీవ గుమ్మఘట్ట సదాశివ చుట్టుపక్కల గ్రామాల కార్యకర్తలు నాయకులు సర్పంచులు మాజీ సర్పంచులు ఎంపిటిసిలు మాజీ ఎంపీటీసీలు టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కాకాణి... ఓవర్... ఇప్పుడు అనిల్



**నెల్లూరు-సూర్య వాస్తవం, జూలై 25:** నెల్లూరులో మరో వైసీపీ కీలక నేత చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. కూటమి హిట్ లిస్ట్‌లో ఉన్న లీడర్లలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ కూడా ఒకరని టీడీపీ నేతలు ఆఫ్ ది రికార్డులో చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఓడినప్పటి నుంచి నెల్లూరుకు దూరంగా ఉంటూ తన పని తాను చేసుకుంటున్నారు. అనిల్‌కుమార్ యాదవ్. అయితే లేటెస్ట్‌గా మైనింగ్ కేసులో అనిల్‌కుమార్‌కు ఉచ్చు బిగిసేలా కనిపిస్తోంది. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలతో వందల కోట్లు పోగేశారని ఆరోపిస్తూ నెల్లూరుకు చెందిన వైసీపీ నేతలను పోలీసులు అరెస్టు చేస్తున్నారురుస్తుం మైన్స్ తవ్వకాల్లో నెల్లూరు జిల్లాకు చెందిన మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఇప్పటికే అరెస్ట్ అయి జైలులో ఉన్నారు. ఇక వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుడు శ్రీకాంత్ రెడ్డిని పోలీసులు హైదరాబాద్లో అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌కు ఉచ్చు బిగిస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పుడు శ్రీకాంత్ రెడ్డి వాంగ్మూలం ఆధారంగా అనిల్ కుమార్ యాదవ్‌పై చర్యలు తీసుకుంటే నెల్లూరులోని ముఖ్యమైన ఇద్దరు నేతలు ఇరుక్కున్నట్లేనని అంటున్నారు.అక్రమ క్వార్జ్ తవ్వకాలతో సంపాదించిన సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినట్లు శ్రీకాంత్ రెడ్డి విచారణలో చెప్పారంటున్నారు. లీజు గడువు ముగిసినా రుస్తుం మైన్ నుంచి క్వార్ట్స్ తీశామని..మాజీ మంత్రి కాకాణి, అనిల్ కుమార్ యాదవ్ అండతో గూడూరు, సైదాపురం, చిల్లకూరు, వెంకటగిరి ప్రాంతాల్లో మామూళ్లు వసూలు చేశామని శ్రీకాంత్ రెడ్డి వాంగ్మూలం ఇచ్చారటటన్ను క్వార్జ్‌కు రూ.7వేల నుంచి రూ.10 వేలు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలిందని చెబుతున్నారు. మైనింగ్ ద్వారా వసూలు చేసిన డబ్బుతో భారీగా భూములు కొని,వందల ఎకరాల భూమిలో రియల్ వెంచర్లు వేశారనే అలిగేషన్ ఉంది. అక్రమ మైనింగ్ కేసులో ఇప్పటికే 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో కాకాణి 2 నెలలుగా రిమాండ్లో ఉన్నారు. త్వరలోనే అనిల్‌కుమార్ యాదవ్‌కు అరెస్టు చేస్తారని ప్రచారం జరుగుతోంది.మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ముందు నుంచి టీడీపీకి టార్గెట్‌గా ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. 2014లో టీడీపీ పవర్‌లో ఉన్నప్పుడు అపోజిషన్‌లో ఆయన చేసిన హడావుడి ఒక ఎత్తు అయితే. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక మంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్, పవన్‌ను ఉద్దేశించి అనిల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు కూటమి ఇంకా మరిచిపోలేదంటున్నారు.

టైమ్ చూసి..అన్ని ఆధారాలు దొరికినప్పుడు ఏదో ఒక కేసులో అనిల్‌కుమార్‌ను రౌండప్ చేస్తారని కూటమి పవర్‌లోకి వచ్చినప్పటి నుంచి ప్రచారం జరుగుతోంది. అయితే శ్రీకాంత్‌రెడ్డి అరెస్ట్‌తో అనిల్ కుమార్ వసూళ్ల దందా..అక్రమ మైనింగ్ వ్యాపారం మొత్తం వెలుగులోకి వచ్చిందని అంటున్నారు. పక్కా ఆధారాలు దొరికాయని..శ్రీకాంత్‌రెడ్డి వాంగ్మూలంతో అనిల్‌కుమార్ ఇరికిపోవడం పక్కా అన్న ప్రచారం బయలుదేరింది. ఈనేపథ్యంలోనే ఈ వీకెండ్‌లో అనిల్‌కుమార్ అరెస్ట్ ఉండొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఏం జరగబోతుందో చూడాలి మరి.

# చెత్త ఇవ్వండి... డబ్బులు తీసుకోండి




**విజయవాడ-సూర్య వాస్తవం, జూలై 25:** ఆంధ్రప్రదేశ్ పంచా యతీ రాజ్ శాఖ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సరికొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. స్వచ్ఛ రథం పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పనికిరాని వస్తువులను సేకరిస్తారు. వాటికి బదులుగా డబ్బులు లెక్కించి, అవసరమైన సరుకులు ఇస్తారు. గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమం ఈ నెల 10న ప్రారంభమైన సంగతి తెలిసిందే.. తాజాగా ఎన్టీఆర్ జిల్లాలో ఆగస్టు 1 నుంచి ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశారు. పైలట్ ప్రాజెక్టుకు ఎంపిక చేశారు. ఈ మేరకు ఒక వాహనాన్ని అద్దెకు తీసుకున్నారు.. దానిని స్వచ్ఛ రథంలా మార్చారు. ఆగస్టు 1 నుంచి అధికారులు రోజూ రెండు వార్డులు తిరిగేలా ఈ కార్యక్రమాన్ని ప్లాన్ చేశారు. ఈ మేరకు వారంలో రెండు సార్లు గ్రామాల్లో ఇళ్ల దగ్గరకు వెళ్లి చెత్తను సేకరిస్తారు.. వాటికి బదులు డబ్బులు లెక్కగట్టి వాహనం వెనుక భాగంలో ఉండే నిత్యావసర సరుకులు ఇస్తారు. వాహనం ముందు భాగంలో పొడి చెత్తను ఉంచుతారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే ఇతర ప్రాంతాలకు కూడా విస్తరిస్తామంటున్నారు.గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ఇప్పటికే అమలు చేస్తున్నారు. పలు గ్రామాల్లో స్వచ్ఛ రథం ద్వారా చెత్త, వ్యర్థాలను సేకరించి వాటికి డబ్బులు విలువ కట్టి సరుకులు ఉచితంగానే అందజేస్తున్నారు. గుంటూరు సమీపంలోని 11 గ్రామాలకు స్వచ్ఛ రథం ప్రతి 15 రోజులకోసారి వెళ్లేలా ప్లాన్ చేశారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా డబ్బాల్లో వేయాలని సూచిస్తున్నారు. ప్రజలు ఆ వ్యర్థాలను తీసుకొచ్చి స్వచ్ఛ రథం దగ్గర అప్పగిస్తే.. తూకం వేసి కిలోకి రూ. 16 నుంచి రూ. 20 వరకు విలువ కడుతున్నారు.ఆ తర్వాత ఆ విలువను బట్టి నిత్యావసరాలు, వస్తువులు అందజేస్తున్నారు. స్వచ్ఛ రథం సిబ్బందికి ప్యాకెట్లు, ప్యాకింగ్ కవర్లు, పాత పేపర్లు, గాజు సీసాలు, ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, పనికిరాని వస్తువులు, అట్టలు, ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలు, కంప్యూటర్లకు సంబంధించిన వస్తువులు, నూనె డబ్బాలు ఇలా పనికిరాని వస్తువుల్ని తీసుకొచ్చి ఇవ్వొచ్చు. ఈ స్వచ్ఛ రథం పర్యవేక్షణ కోసం సచివాలయంలోని ఓ ఉద్యోగిని కేటాయించారు అధికారులు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )